
నినాదం
నిఖార్సైన జర్నలిజం
# సాహితీ లహరి
ఆదివారం 1-03-2026

## కాశీ క్షేత్రం...



సీ.
పావన క్షేత్రము పంచక్రోశుల పెట్టు
వ్యాపించియున్నదీ ప్రాంతమందు
గొడుగు రూపముదాల్చి గోపురమ్ముగ నిల్చి
చోద్యమ్ముగను దోచు సురలకైన
అద్భుతమైన దృశ్యాలను వర్ణింప
నమరులకైనను నలవి యగున?
పట్టణమంతయు పరమేశ్వరుడు దర్శ
నమ్మిచ్చు లింగరూపమ్ముతోడ
తే.గీ
ఇట్టితీర్థమందున తానమింపుమీర
నాచరించిన నమరత్వ మందుకొనరె
సకల భక్త మోక్షప్రద స్థావరమ్ము
శివకృపాలబ్ధ వరము కాశీపురమ్ము.



జి.గోవర్ధన్, తెలుగు లెక్చరర్,
ఎం.వి.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలెం,
మహబూబ్ నగర్ 509001

# ప్రభవలో శ్రీశ్రీ ప్రకృతి పారవశ్యం

**శ్రీతయశ్రీ అనగానే అభ్యుదయ, విప్లవ కవిగానే చూస్తుంటాం. కానీ, తొలినాళ్లలో ఆయన కవిత్వాన్ని చూస్తే ప్రకృతి నెంతగా వర్ణించాడో తెలుస్తుంది. శ్రీశ్రీ తొలినాటి కవిత్వంలో ప్రకృతి తన ఆత్మకు ప్రతి బింబంగా వర్ణించారు. ప్రభవ కవితా సంపుటికి ముందు మాట రాసిన పురిపండా అప్పల స్వామి గారు చెప్పినట్లు, 'ప్రభవ' కావ్యంలో శ్రీశ్రీ ప్రకృతిని ఒక ఉపాస్య దేవతగా ఆరాధించారు. విహంగాల కలకూ జిత ధ్వనులతో తన కంఠాన్ని మేళవించి, ప్రకృతి ధామంలో అమృత తుల్యమైన నవ మాధురిని పండించాలని ఆయన తపించారు. కొండలు, కోనలు, మేఘ శకలాలను చూసి పరవశిం చడమే కాక, ఆప్రకృతిలోని అనంతమైన రహస్యా లను ఛేదించాలనే ఒక దార్శనిక జిజ్ఞాస ఆయనలో కనిపిం చేది. బాహ్య సౌందర్య ఆరాధన నుండి అంతర్గత స్వేచ్ఛా పిపాస వరకు, శ్రీశ్రీ తొలినాటి కవిత్వం ప్రకృతి పారవ శ్యంతో నిండిన ఒక అద్భుత రసకావ్యం.**

ప్రకృతి అంటే కేవలం మనకంటికి కనిపించే చెట్లు, పుట్టలు, నదులు, పర్వతాలు మాత్రమే కాదు; ఈ అనంత విశ్వంలోని సమస్త జీవరాశిని, పంచభూతాలను (గాలి, నీరు, నిప్పు, ఆకాశం, భూమి) తనలో ఇముడ్చుకున్న ఒక అద్భుత శక్తి. మానవ మనుగడకు పునాది అయిన ప్రకృతి, నిరంతరం మారుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడుతుంది. అది మనకు ప్రాణవాయువును, ఆహారాన్ని, ఆశ్రయాన్ని అందించే కల్పవృక్షం వంటిది. క్లుప్తంగా చెప్పాలంటే, ప్రకృతి ఒక నియమం, ఒక క్రమశిక్షణ, ప్రతి ప్రాణి పుట్టుక నుండి మరణం వరకు తోడుండే ఒక నిరంతర ప్రవాహం.

"ఆ మహోన్నత దివ్య వృక్షాగ్రమందు
నూత్న చైతన్య రాగ సన్నుతములగుచ్చఁ
గదలి యాడెడు పత్ర సంఘముల నడుము
నేను సైత మొక్కాకునై యెనయుదేని" అని

ఈ అనంతమైన విశ్వం లేదా మానవ సమాజం అనే ఒక మహోన్నతమైన దివ్య వృక్షం పైభాగంలో, నూతన చైతన్యంతో, సరికొత్త రాగాలతో నిరంతరం కదలాడుతూ ఉండే ఆకుల సమూహం (తోటి మానవులు లేదా జీవరాశి) మధ్యన... నేను కూడా ఒక చిన్న ఆకునై వారితో కలిసి జీవించగలిగితే ఎంత బాగుంటుందో కదా! అని కవి తన ఉనికిని ప్రకృతిలో ఒక భాగముగా ఊహిస్తున్నారు.

"అన్నిటి విధాన జీవించి యున్న కాల
మాట పాటలతోఁ బూర్తియైన వెనుకఁ
గళలఁ గోల్పడి, కలుషపంకమునఁ జిక్కి,
క్రిందబడి పాంథజనులు త్రొక్కిళుల స్రుక్కి"

మిగిలిన ఆకుల మాదిరిగానే, నా జీవిత కాలమంతా మాటలతో, పాటలతో (ఆనందంగా) గడిచి పోయిన తర్వాత... సహజంగానే శక్తిని (కళలను) కోల్పోయి, రాలిపోయి, కలుషితమైన బురదలో చిక్కుకుపోయి, బాటసారుల కాళ్ల కింద పడినలిగిపోతూ సాధారణ మరణం లేదా విస్మృతిని వర్ణించారు.

"ప్రకృతి యాగారమున నశింపంగఁబోక
గాలి యొసఁగెడు క్రొత్త జెక్కల ధరించి,
అతి నిరాఘాటముగ విహాయస పథాల
నెఱుక పడరాని యెచటికో ఎగసిపోదు!"

అలా బురదలో పడి, ప్రకృతి అనే ఈ శాలలో కేవలం నశించిపోకుండా... గాలి అందించే సరికొత్త రెక్కలను (జ్ఞానము లేదా స్వేచ్ఛా భావన) ధరించి, ఎటువంటి అడ్డంకులు లేని ఆకాశ మార్గంలో, ఎవరికీ తెలియని, అంతుచిక్కని ఏ మహోన్నత శిఖరాలకో ఎగిరిపోతాను! అని కవి తన ఆత్మీయ స్వేచ్ఛను, మరణాతీతమైన స్థితిని ప్రకటించారు.

ఈ అనంతమైన ప్రకృతిలో దాగి ఉన్న గాఢమైన రహస్యాలను (సృష్టి మర్మాన్ని) అర్థం చేసుకోలేక, స్థిరత్వం లేని మనసుతో (చంచల మనస్కత) ఇటు అటు తిరుగుతున్న నాకు. ఈ విశాల విశ్వ వీధుల్లో (విశ్వ పథముల) అల్లాడిపోయి, అలసిపోవడం (వేసరిలుట) అనేది అన్ని విధాలా సమంజసమే (భావ్యమే). **ఎందుకంటే నేను అజ్ఞానిని, అన్వేషిని.? కానీ, ఓ వలాహక శకలమా! (ఓ మేఘ తునక మా!) ... నీవు కూడా నా వలెనే ఎందుకు ఇలా దిక్కుతెలి యక తిరుగుతున్నావు?** అని కవి మేఘాన్ని ప్రశ్నిస్తున్నారు.

శ్రీశ్రీ ఇక్కడ ప్రకృతిలోని 'ఆకు'ను మానవ జీవితానికి ప్రతీకగా తీసుకున్నారు. ఆకురాలిపోవడం అంటే మరణం. కానీ ఆ రాలిపోయిన ఆకు గాలివాటున పైకి లేచి ఆకాశంలోకి ఎగిరిపోవడాన్ని, ఆయన తన సృజనాత్మక స్వేచ్ఛకు లేదా ఆత్మ విముక్తికి సంకేతంగా మలి చారు. ఇది అభ్యుదయ కవిత్వానికి ముందు ఆయనలోని 'రొమాంటిక్' కవి చేసిన అద్భుతమైన తాత్త్విక ప్రయాణం.

"ఈ ప్రకృతి గాధ రాహస్య మెఱ్ఱంగలేక
చంచల మనస్కతఁ బరిభ్రమించు నాకు
విశ్వ పథముల నడయాడి వేసరిలుట
యన్ని విధముల భావ్యమే యగును గాని
ఓ వలాహక శకలమా! నీవు కూడ
నావలటఁ బరిభ్రమించుచున్నా వదేల?"

ఈ అనంతమైన ప్రకృతిలో దాగి ఉన్న సృష్టి మర్మాన్ని అర్థం చేసుకోలేక, స్థిరత్వం లేని మనసుతో ఇటు అటు తిరుగుతున్న నాకు. ఈ విశాల విశ్వ వీధుల్లో అల్లాడిపోయి, అలసిపోవడం అనేది అన్ని విధాలా సమంజసమే ఎందుకంటే నేను అజ్ఞానిని, అన్వేషిని. కానీ, ఓ మేఘ తునకమా!...



నీవు కూడా నా వలెనే ఎందుకు ఇలా దిక్కుతెలియక తిరుగుతున్నావు? అని కవి మేఘాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి శ్రీశ్రీ గారి పదప్రయోగాలు కాళి దాసు మేఘదూతాన్ని స్ఫురింపజేస్తూనే, ఆధునిక భావకవిత్వపు పరిమళాన్ని వెదజల్లుతున్నాయి. ఆయన చదివి సంస్కృత కావ్యానుభవాలను తెలుపుతున్నాయి.

"నవ్విపోదురు గాక నా కేటి సిగ్గు ?
నా యిచ్చయే గాక నా కేటి వెరపు ?
కాలవిహంగమ పక్షముల దేలియాడి
తారకా మణులలో తారనై మెరసి
మాయ మయ్యెదను నా మధురగానమున!

నవ్విపోదురు గాక నా కేటి సిగ్గు ? అని 'స్వేచ్ఛాగానము' పాడుకున్న భావకవి దేవులపల్లి కృష్ణశాస్త్రి ప్రభావం శ్రీశ్రీ పై ఎంతగా ఉందో దీన్ని బట్టి తెలుస్తుంది. శ్రీశ్రీ అభ్యుదయ, విప్లవ కవిగా మారకముందు ఛందస్సులలో, అరసున్నను కూడా విడవకుండా కవిత్వం రాశారు. ఒక సామాన్య కవి లాగే వ్యక్తులు, దైవాలపై ప్రశంస పద్యాలు రాసేవారని 'ప్రభవ' నుబట్టి తెలుస్తుంది. అందువల్ల

శ్రీశ్రీ సాహిత్య ప్రస్థానంలో 'ప్రభవ' ఒక మధురమైన మలుపు. తొలినాళ్లలో ఆయనపై భావకవిత్వ ప్రభావం ఎంతగా ఉందో ఈ కావ్యంలోని ప్రకృతి వర్ణనలు చూస్తే అర్థమవుతుంది. అభ్యుదయ విప్లవభావాలకు ముందే ఆయన ప్రకృతిని ఒక 'ఉపాస్యదేవత'గా ఆరాధించారు. పక్షుల కలకూజితాలతో తన కంఠాన్ని మేళవించాలని తపించడం, ఆకు రాలడాన్ని కేవలం మరణంగా కాక స్వేచ్ఛా గగనంలోకి ఎగిసే 'నవ చైతన్య రెక్కల'గా దర్శించడం శ్రీశ్రీ విశిష్టత. ప్రకృతిలోని గాఢ రహస్యాలను ఛేదించలేక, మేఘ శకలంతో తన చంచల మనస్తత్వాన్ని పోల్చుకుంటూ ఆయన పొందిన ఆత్మీయ పారవశ్యం అద్భుతమైనది. బాహ్య సౌందర్య ఆరాధనతో మొదలై, దార్శనిక జిజ్ఞాసతో ప్రకృతిని తాత్విక భూమికగా మలచుకున్న శ్రీశ్రీ తొలినాటి కవిత్వం భావకవిత్వ పరిమళాలతో నిండిన ఒక రసమయ ప్రయాణం.

అత్యుదగ్ర తమిస్ర దుర్వ్యాపృతి ప్ర
భిన్నమానైక శక్తిసంపన్న నిశిత
భానుకిరణ ప్రశస్తమై ప్రాచి దోఁచె!

సమయ మయ్యెను నీ పూజ సలుపుకొఱకు...అని ప్రభాత గీతాల్ని కూడా రాసుకున్నాడు. అత్యంత భయంకరమైన గాఢాంధకారాన్ని తన నిశితమైన కిరణాలతో ఛేదించగల అద్భుత శక్తి కలిగిన సూర్యుడు తూర్పు దిశన ఉదయించాడు. ఆ కిరణాల కాంతితో ప్రాచీ దిశ వెలిగిపోతోంది. చీకట్లు తొలగి వెలుగులు వచ్చిన ఈ శుభ సమయం నీ పూజను నిర్వహించుకోవడానికి అత్యంత అనువైనదని ఆ పద్య సారాంశం. ప్రకృతి గీతాలను రాసుకున్న శ్రీశ్రీ తర్వాత కాలం భావ, అభ్యుదయ విప్లవ పరిణామాలను తన సాహిత్యంలో పలికించి తనదైన ముద్రను వేయగలిగాడు. వస్తువులోనూ, శైలిలోనూ విప్లవాత్మక మార్పులు తెస్తూనే, పద ప్రయోగంలో ఒక విలక్షణమైన శబ్ద శక్తిని నింపి, భావి తరాల కవులకు ఒక మార్గదర్శిగా తన అక్షర ముద్రను శాశ్వతం చేసుకున్నారు. 'మహాప్రస్థానం' ద్వారా తెలుగు కవిత్వంలో ఒక దిశానిర్దేశం చేస్తూ, భావ కవిత్వపు కాల్పనిక లోకాల్లో విహరిస్తున్న సాహిత్యాన్ని నేల మీదకు, సామాన్యుడి కష్టాల వైపు మళ్లించారు.

మోటూరి హిమబిందు
రీసెర్చ్ స్కాలర్, తెలుగు శాఖ,
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్,
హైదరాబాద్ - 500 046.
ఫోన్: 6302229300




# ప్రతిఘటన స్త్రీశక్తియే చంద్రవంక

**సామాజిక అసమానతలుపై దరువేయు నిప్పులలో నడిచే తప్పెట తానై, బడుగు బతుకుల కన్నీటికి కారణమైన మోస పూరిత చర్యలపై అక్షర శరము సంధించి ధనస్సు ఎక్కు పెట్టిన విలుకాడై, కరువు రక్కసి కోరల్లో చిక్కిన వలస బతుకుల కన్నీటి వెతలను ఏడు తరముల ఎర్ర ఓబనపల్లి చరితను చిత్రించి, మానవ జాతి అభ్యున్నతి కాంక్షించు అనుభూతి కవి, రచయిత దుగ్గినపల్లి ఎజ్రాశాస్త్రి. వారి కలం నుండి జాలువారి గల గల ప్రతిఘటన ధారలు కురిపించిన నవలే చంద్రవంక. రైతు ఉద్యమ కుటుంబ నేపథ్యంలో పుట్టి, సాయుధ బాట పట్టి, జన జీవన స్రవంతిలో కలిసిపోయి, తాడిత పీడిత దీన జనుల దళితుల సమస్యలపై స్పందిస్తూ, జ్యోతిరావు పూలే సమతా భావం, అంబేద్కర్ సమీకరించు- బోధించు- పోరాడు త్రిసూత్రాలను పాటిస్తూ, అన్యాయ అక్రమాలను ప్రతిఘటించిన స్త్రీశక్తియే చంద్రవంక. బడుగు బతుకులపై, స్త్రీలపై జరుగుతున్న దాడులను ఖండించుటకు బిగించిన పిడికిలే చంద్రవంక. పోరుబాట దిశ నుండి రాజ్యా ధికార దిశగా అడుగులు వేస్తూ, యథార్థతను తలపించే కల్పిత గాథయే ఎజ్రాశాస్త్రి చంద్రవంక.**

**పాత్రలు - పాత్ర చిత్రణ...**

సందర్భానుసారంగా చంద్రమ్మ, చంద్రవంక బాబాయ్, రత్నం, శాలిని, దుర్గ భవాని, దొరబాబు, దత్తుడు, వీరయ్య చౌదరి, శాంతమ్మ, శ్రీనివాసరావు, సాంబశివరావు, నయీం, వజీర్, పరశురాం, తారక్ నాథ్ వంటి పాత్రలెన్ని సృష్టించినా కథాకథనం చంద్రవంక, విజయ్, చైతన్య, తలుపులమ్మ, లోవరాజు వంటి ముఖ్య పాత్రల చుట్టూ నవల నడుస్తుంది. నాటి రైతు కూలీల సమస్యలు, కౌలు రైతుల ఇతి బాధల గురించి, శ్రమ దోపిడీ గురించి, వారి సమస్యలపై పోరాడి తల్లిదండ్రులను కోల్పోయి నక్సల్‌గా మారి, ప్రభుత్వానికి లొంగిపోయి సమాజంలో జరుగు సామాజిక అంశాలపై దురాగతాల పై చేసే పోరు చేసే చంద్రవంక పాత్రను చక్కగా తీర్చిదిద్దాడు నవలాకారుడు.



**మానవతావాద మచ్చుతునక చంద్రవంక**

చంద్రమ్మ అను గృహ సముదాయ యజమాని ఇళ్లల్లో అద్దెకు ఉంటూ అన్యోన్యంగా ఉంటారు విజయ్, చైతన్య, లోవరాజు, తలుపులమ్మలు. వీరికి చంద్రవంక తోడౌతుంది. తలుపుల మ్మ సోదరుడైన లోవరాజు మద్యానికి బానిసై రాత్రులు డ్రైనేజ్ వద్ద, బజార్లో పడిపోయిన ప్రతిసారీ తలుపులమ్మ తోపాటు విజయ్, చైతన్య, చంద్ర వంకలు వెతికి ఇంటికి తీసుకువచ్చేవారు. లోవరాజు తాగుడు వల్ల అవయవాలు చెడిపోయి ఆసుపత్రి పాలైనప్పుడు విజయ్, చైతన్య, చంద్ర వంకలు బాసటగా నిలబడతారు, విజయ్ - చంద్రవంకలు విజ్జేశ్వరం పార్కో ఆదర్శ వివాహం చేసుకుని బంధువులు, అయిన వాళ్ళు ఎందరు ఉన్నప్పటికీ తలుపులమ్మ, లోవ రాజుల దీవెనలు తీసుకొని ఒకటవుతారు. లోవ రాజు చావు బతుకుల్లో ఉన్నప్పుడు చంద్రవంక అంబేద్కర్ కాలనీలో ఉన్న ఇంట్లో ఉండడానికి ఏర్పాటు చేస్తుంది. నయీం అనుచ రులు చేసిన రైలు దోపిడీకి నిరాకరించి నందుకు చైతన్యను కాల్చి చంపుతారు. చైతన్య మరణానికి కారకులైన వారిని పట్టించే అంతవరకు చంద్రవంక, విజయ్ లు పట్టువదలక విశ్వ ప్రయత్నాలు చేస్తారు.

ఒంటరిగా మిగిలిన చైతన్య తల్లి శాంతమ్మను విజయ్ - చంద్రవంకలు ఆదరిస్తారు. అన్యా యం జరిగిన ప్రతిసారి చంద్రవంక, విజయ్ లు ప్రతిఘటించి, ప్రశ్నిస్తారు. దీనికి కారణం మానవతా దృక్పథం. మానవతావాదాన్ని చంద్రవంక, విజయ్ పాత్రల ద్వారా ఎజ్రాశాస్త్రి చూపారు.

**మద్యపాన పర్యవసానాలు**

దళితుల కుటుంబాలలో వారి ఎదుగూ బొదుగూ లేని జీవితాలకు పేదరికం ఒక కారణమైతే ఆ పేదరికానికి ముఖ్య కారణం మద్యపానం. కూలినాలి పనులు చేస్తూ జీవనం వెళ్ళ తీయు మాల, మాదిగల కుటుంబాలలో ఆర్థిక, సామాజిక ఆరోగ్య స్థితి గతులు మరింత విషమంగా మారే స్థితిని తలు పులమ్మ సోదరుడు లోవరాజు, లారీ డ్రైవర్ అయిన చైతన్య తండ్రి, రిక్షా కార్మికులు మరియు తాంబరంలో మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులుగా పని చేస్తూ ఆడ మగ తారతమ్యం లేకుండా రబ్బర్ ట్యూబ్‌లో సారా తాగు పాత్రల ద్వారా నవలాకారుడు తేటతెల్లం చేశారు.

**కుల వివక్షత - ప్రతిఘటన**

మాదిగ కులానికి చెందిన చైతన్య తన తండ్రి తాగుడికి బానిసై మరణించిన తర్వాత చైతన్య తల్లి అయిన శాంతమ్మను యాదవ కులానికి చెందిన శ్రీనివాసరావు ఇష్టపడి రెండో వివాహం చేసుకుని మాదిగపల్లెలో నివసిస్తూ ఉంటాడు. ఉన్నత విద్యావంతుడు సివిల్స్ మెయిన్స్ ఉత్తీర్ణుడైన చైతన్య మరియు మంగలి కులంకు చెందిన శోభనలు ఇరువురు పరస్పరం ప్రేమించుకుంటారు కానీ వారి వివాహానికి శోభన తండ్రి సాంబశివరావు అంగీకరించకపోగా చైతన్య మరణా నికి కారణం అవుతాడు. సాంబశివరావు బాగా చదువుకొని ప్రభుత్వ కళాశాలలో లెక్చరర్ గా పని చేస్తున్నప్పటికీ ఆనాటి కుల వివక్షతను సాంబశివరావు పాత్ర ద్వారా చిత్రీకరించారు ఎజ్రాశాస్త్రి. అక్షర జ్ఞానం లేని వారు కుల తారతమ్యాలను, పట్టింపులను పక్కన పెడుతుంటే ఉన్నత విద్యావంతులు ఈ జాడ్యాన్ని వీడుటలేదని వాపోయాడు శాస్త్రి.

**స్త్రీలపై అత్యాచారాలు - ప్రతిఘటన...** విజయ్ తన కుటుం బ నేపథ్యాన్ని చైతన్యతో చెబుతూ ప్రేమ పేరుతో తన తల్లి ఒక వివాహిత చేతిలో మోసపోయి తమ కోసం వివాహం చేసుకోకుండా తన జీవితాన్ని త్యాగం చేసిందని చెబుతాడు. మైనర్ బాలికలపై జరిగిన అత్యాచారాలను, అకృత్యాలను చంద్రవంక ద్వారా ప్రతిఘటించాడు. మాతంగి కొలుపుల పేరుతో అభం శుభం తెలియని బాలికలు, దళిత స్త్రీలను దేవుడు పెళ్ళాం పేరుతో జరిపే మూఢ విశ్వాసాల తంతును చంద్రవంక బృందం ద్వారా ప్రశ్నించి, ఖండించారు. కుల వివక్ష చూపుతూ దేవాలయ ప్రవేశాన్ని అడ్డుకున్న అగ్రవర్ణాలకు దేవుని భార్య పేరుతో ఒక దళిత స్త్రీని మాతంగిగా మార్చే హక్కు ఎవరిచ్చారని శాస్త్రి ప్రశ్నించాడు. దారంచేడు సంఘటనలో తప్పుని ప్రతిఘటించిన స్త్రీని కాళ్లతో తన్నడం, ఎర్రఓబనపల్లెలో అగ్రవర్ణాల దాడిలో గర్భవతి అయిన స్త్రీ మరణించడం వంటి స్త్రీలపై జరిగే భౌతిక దాడులు చంద్రవంకలో నిలదీశాడు.

అనిల్ కుమార్ దార్వేముల,
మాచర్ల, గుంటూరు జిల్లా.

## నవ సమాజ గీతిక

మనుజులలో తొలగిపోవాలి మూఢత్వం
కులమత భేదాలతో వద్దు మూర్ఖత్వం
నింగిని గెలిచే జ్ఞాన దీపం వెలగాలి
నేలపై సమానత్వ వృక్షం విరియాలి.

పసి హృదయాలలో పరిమళించాలి
నిర్మలమైన స్వేచ్ఛా వాయువుల జీవితం
వనంలో మనసులు కలిసి మెలగాలి
భావితరాలకు ప్రాణవాయువు మిగలాలి.

పిడికెడు మెతుకులు పండించే
ఆ బురద చేతులకు మొక్కాలి
వారసత్వం కోల్పోతున్న రైతన్నకు
పసిడి పంటల్లో భాగ్యలక్ష్మి తోడవాలి.

నిప్పురవ్వల్లో పుట్టే వస్తువుకై
తనువును అర్పించే శ్రామికుడే రాజు
చెమట చుక్కల స్నానముతో తడిసిన
ఆ శ్రమ బిందువులకు విలువే రావాలి.

దేశ రక్షణను కళ్ళల్లో ఒత్తుల్లా చూస్తూ
సర్వం అర్పించే వీర సైనికులే శిఖరాలు
ప్రజలంతా సుఖంగా నిద్రిస్తున్నారంటే
తాము మేల్కొని తల్లి సేవలో తరిస్తున్నారు.

ప్రగతి రథానికి చక్రాల్లా కదులుతూ
విశ్వంభర గీతిలో విజయాల సరములతో
అక్షరాన్ని ఆసరాగా చేసుకొని
నవనిర్మాతల కలం నుండి అక్షరాలు ప్రవహించాలి.



కొప్పుల ప్రసాద్, నంద్యాల
9885066235

## సాయి సాహిత్య ముచ్చట్లు 1

# తొలి తెలుగు కథానిక 'దిద్దుబాటు'?

**గురజాడ అప్పారావు గారు రచించిన 'దిద్దుబాటు' తెలుగు సాహిత్యంలో వెలువడిన తొలి ఆధునిక కథానికగా గుర్తింపు పొందింది. 1910లో ప్రచురితమైన ఈ కథ, నాటి సమాజంలోని దురాచారాలను, ముఖ్యంగా వేశ్యాలోలత్వాన్ని హాస్యస్ఫోరకంగా, వ్యంగ్యంగా ఎండగట్టింది.**

ఈ కథానికలో ప్రధానమైన సంస్కరణ కుటుంబ వ్యవస్థను చక్కదిద్దడం, వ్యక్తిగత ప్రవర్తనలో మార్పు తీసుకురావడం. నాటి సమాజంలో విద్యావంతులు, ధనవంతులైన పురుషులు వేశ్యాలోలత్వానికిలోనై తమ సంసారాలను నిర్లక్ష్యం చేసేవారు. గురజాడ గారు ఈ దురాచారాన్ని కేవలం విమర్శించడానికే పరిమితం కాకుండా, ఒక గృహిణి తన తెలివితేటలతో, పట్టుదలతో భర్తలో పశ్చాత్తాపాన్ని ఎలా కలిగించవచ్చో చూపారు. భర్తను నిందించడం కంటే, అతను తన తప్పును స్వయంగా తెలుసుకునేలా కమలిని పన్నే 'ఉపాయం' ఒక గొప్ప సామాజిక దిద్దుబాటుగా నిలుస్తుంది.

మరో ముఖ్యమైన సంస్కరణ స్త్రీ చైతన్యం, భాషా విప్లవం. అణకువగా ఉండి కన్నీళ్లు కార్చే అబలగా కాకుండా, సమస్యను ఎదుర్కొనే ధైర్యం ఉన్న విద్యావతిగా కమలిని పాత్రను చిత్రించడం ద్వారా నాటి మహిళా లోకానికి గురజాడ ఒక దిశానిర్దేశం చేశారు. అలాగే, పండితులకే పరిమితమైన సాహిత్యానికి సామాన్యుల 'వాడుక భాష'ను అద్దడం ద్వారా భాషా పరమైన సంస్కరణకు ఆయన నాందిపలికారు. కేవలం నాలుగు పేజీల్లోనే ఒక వ్యక్తి మనసును, తద్వారా సమాజపు ఆలోచనా ధోరణిని మార్చగల శక్తి ఈ కథానికకు ఉంది. ఆధునిక కథానికకు ఉండవలసిన ప్రధాన లక్షణాలైన ఏకైక కథాంశం, క్లుప్తత ఈ కథలో పరిపూర్ణంగా కనిపిస్తాయి. వేశ్యాలోలత్వం అనే ఒకే ఒక సామాజిక రుగ్మతను ఇతివృత్తంగా తీసుకుని, అనవసరమైన ఉపకథలు లేకుండా కేవలం నాలుగు పేజీల్లోనే అత్యంత ప్రభావవంతంగా దీనిని గురజాడ తీర్చిదిద్దారు. కథా ప్రారంభం నుండి ముగింపు వరకు పాఠకుడి కుతూహలాన్ని పెంచుతూ, భార్య కనిపించలేదనే ఆందోళనతో మొదలై, భర్తలో కలిగిన మార్పుతో కథ సుఖాంతమవుతుంది. ఈ బిగువైన కథనశైలి, లక్ష్య శుద్ధి దీనిని ఒక ఉత్తమ కథానికగా నిలబెట్టాయి. మరోవైపు, పాత్ర చిత్రణ, వాస్తవికత అనే లక్షణాలు ఈ కథలో అద్భుతంగా మేళవించబడ్డాయి. కమలిని, గోపాలరావు, రావుడు అనే అతి తక్కువ పాత్రలతో, వారి మధ్య జరిగే సంభాషణల ద్వారా నాటి సమాజంలోని జీవనశైలిని గురజాడ కళ్లకు కట్టారు. ముఖ్యంగా 'వాడుక భాష'ను ప్రవేశపెట్టడం ద్వారా కథకు సహజత్వం చేకూరింది. కథాంతంలో వచ్చే మెరుపు ముగింపు పాఠకుడికి ఒక కొత్త ఆలోచనను కలిగిస్తుంది. కథానికలోని పాత్రలు అత్యంత సహజంగా, సజీవంగా చిత్రించబడ్డాయి.

ప్రధాన పాత్ర కమలిని విద్యావంతురాలు, సమయస్ఫూర్తి కలిగిన ధైర్యవంతురాలు; భర్తను నిందించడం కంటే తన తెలివితేటలతో అతడిలో మార్పు తీసుకురావాలని ప్రయత్నించే 'ఆధునిక స్త్రీ'కి ఆమె ఒక ప్రతీక. ఇక గోపాలరావు పాత్ర లోపాలున్న సామాన్య మానవ స్వభావానికి అద్దం పడుతుంది; అతడు వ్యసనాలకు లోనైనప్పటికీ, భార్య పట్ల అనురాగం కలవాడు కావడమే అతనిలో 'దిద్దుబాటు'కు అవకాశం కల్పించింది. ఇక వీరిద్దరి మధ్య వారధిలా నిలిచే పాలేరు రావుడు, తన యజమానుల పట్ల విధేయతను ప్రదర్శిస్తూనే, కమలిని ప్లాన్ అమలు చేయడంలో హాస్యస్ఫోరకంగా సహాయపడే ఒక అమాయకపు నమ్మకస్తుడు. ఈ మూడు పాత్రల మధ్య జరిగే సంఘర్షణ, సంభాషణలే కథకు ప్రాణ ప్రతిష్ఠ చేశాయి.

**ఈ కథానిక కేవలం వర్ణనలకే పరిమితం కాకుండా, ఒక సామాజిక సమస్యకు పరిష్కారాన్ని చూపుతూ దిశానిర్దేశం చేయడం వల్ల ఇది కథానిక లక్షణాలన్నింటినీ పుణికిపుచ్చుకున్న తొలి తెలుగు ఆధునిక కథానిక అనడానికి కారణమయ్యింది. అయితే బండారు అచ్చమాంబ గారి స్త్రీ విద్య, త్రయోదశి కథానికలను కూడా కాలాన్ని బట్టి తొలి తెలుగు కథానికలని సాహితీవేత్తలు భావిస్తున్నారు. వీటి గురించి మరోసారి చర్చించుకుందాం.**

డి. సాయినాథ్ రెడ్డి
6305584064



## సాహిత్య రచనలకు ఆహ్వానం

ప్రతి ఆదివారం నినాదం పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలును ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.

sahityalahari0@gmail.com
Whatsapp No: 6305584064

నినాదం
నిఖార్సైన జర్నలిజం
ఆదివారం 01-03-2026

# సాహితీ లహరి




మానవుడికి ముందే ప్రకృతి ఉంది. డార్విన్ జీవ పరిమాణ సిద్ధాంతం ప్రకారం మానవుడి కంటే ముందే చాలా ప్రాణుల జనన-మరణ క్రమాలు జరుగుతున్నాయి. నాలుగు పాదాల కోతుల నుంచి రెండు పాదాల మానవుడిగా నిలబడడానికి చాలా సంవత్సరాలే పట్టింది. ఆ పరిణామం ద్వారా ఆదిమానవుడు కొండ కొనల్లో నీటి ఒడ్డు ప్రాంతాలలో సంచార జీవితం సాగిస్తూ వచ్చాడు. ఈ గుంపు సంచారమే ఒక తెగగా రూపుదాల్చింది. వారికంటూ ఒక నాయకుడు, ఒక దేవుడు. కొన్ని గుర్తులు, గుర్తింపులు, సంస్కృతి, సంప్రదాయాలు పుట్టుకొచ్చాయి. అలా ఏర్పడిన తెగలు భారతదేశమంతా విస్తరించి ఉన్నాయి. 'ఏ దేశ సంస్కృతి కాదు ఒక స్థిర బిందువు' (తిలక్) అన్నారు. కానీ చాలా శతాబ్దాల వరకు భార తీయ గిరిజనుల జీవితాలు అడవిని స్థిరంగా చేసుకొనే సాగాయి. వనవాసి, ఆదివాసి, గిరిజనులు ఏ పేరుతో పిలిచిన ప్రకృతితో ముడిపడి ఉన్న జీవితాలు వారి సొంతం, భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం. ఈ భినత్వంలో అధిక భిన్నంగా ఉన్నది గిరిజనులే. సుమారు దేశ జనాభాలో 10.4 కోట్ల గిరిజనులు ఉన్నారు. ఇప్పటికి గిరిజనులు అడవులను వదిలి రాకపోవడానికి 'అధిక జనాభా ఒత్తిడి, తమ హిందూ నాగరికత ప్రభావానికి వెలుపల ఉండడం వల్ల నాగరిక ప్రజలు తమ విలువలు గిరిజనులపై రుద్దడం అనవసరమని భావించారు' అని హెమాన్ డార్ఫ్ అంచనా కట్టారు.

హైదరాబాద్, (నినాదం):

# నా 30 ఏళ్ల శ్రమ

# ఈ 'భారతీయ గిరిజన వీరులు'

గిరిజనులు నిస్వార్ధపరులు. స్వేచ్ఛగా సంచరిస్తూ దైవంలా భావించే ప్రకృతి ఒడిలో ఒదిగిపోయి ఉంటారు. మిగతా సమాజానికి వీరికి ఏ విధమైన జీవన పోలికలు ఉండవు. ఇలా ఉండకపోవడానికి కారణంగా "తమ జీవన ప్రమాణాలను మెరుగు పరుచుకోవాలని, భౌతిక సుఖాలు అనుభవించాలన్న తపన గిరిజనుల్లో ప్రవేశించలేదు. ప్రశాంతమైన గిజనుల జీవన విధానంలోకి బ్రిటీషువారి అటవి చట్టాలు, సామాజిక చట్టాలపై మొదలైన నిరసన తరవాత తర్వాత స్వాతంత్ర్య వాంఛగా రూపుదాల్చింది. అందులో భాగంగానే బిర్సా ముండా (ముండా-జార్ఖండ్), బుద్ భగత్ (ఉరాన్-జార్ఖండ్), తిల్కా మాంఝి (సంతాల్–బిహార్), కొమరం భీం (గోండు-తెలంగాణ), తల్కల్ చందు (కురిచియ-కేరళ) మొదలైన అడవిపుత్రులు విల్లు ధరించి పోరాటం నడిపారు. సహజంగా సొంత పాలనని ఇష్టపడే గిరిజనుల అభిమతాన్ని గమనించిన బ్రిటీషువాళ్ళు కూడా గిరిజనులకై ప్రత్యేక చట్టాలు, జిల్లాలను, ఏర్పాటు చేశారు. స్వతంత్ర భారతంలో కూడా వీటి ప్రాధాన్యతను గుర్తించి గిరిజనశాఖను కూడా ఏర్పాటు చేశారు.




స్వాతంత్ర్య సమరానికి తొలిగా బరి గీసింది 'గిరిజనులు'"సహజంగా తాము నివసించే పరిధి మేర భూమికోసం, అందులో సంచరించడానికి స్వేచ్ఛ కోసం పోరాడడం ఆ ప్రాంత స్వాతంత్ర్య పోరాటం అయితే ఈ దేశంలో గిరిజనులు తొలి స్వాతంత్ర్య సమరయోధులుగా అధికారిక ప్రకటన చెయ్యడానికి అన్ని తెగల నుంచి ఆధారంగా చెప్పడానికి, చూపడానికి ఎందరో యోధులు ఉన్నారు. విదేశీ పాలకులకు వ్యతిరేకంగా మొట్టమొదట పోరాడింది గిరిజనులేనని గుర్తించనంతవరకూ వారు చేసిన అపార త్యాగాలను గమనించనంతవరకూ గిరిజనులకు న్యాయం జరగదు".

-నదీం హస్ నైన్ (భారతీయ గిరిజనులు)

**ఆచార్య ఎం. గోనా నాయక్**
తెలుగుశాఖ , హైదరాబాద్ విశ్వవిద్యాలయం

## గిరిజనుల స్వపరిపాలన విధానం:

కుటుంబం కంటే ముందు సమూహ సంచార జీవితాలు గడిపేవారు గిరిజనులు. ఇంటికి పెద్ద ఉన్నట్టు గానే గ్రామానికి కూడా ఒక పెద్ద ఉండేవాడు. రమారమి అన్ని గిరిజనుల తెగల్లోను ఈ విధానం ఉంది. నాయక్, మంజీ, పటేల్, ముండా, సర్దార్, షాలు అని ఆయా గిరిజన తెగలు వివిధ పేర్లతో పిలుచుకొంటారు. గ్రామ పెద్దకు సర్వ అధికారాలు ఉంటాయి. ఆయనతో పాటు కొంతమంది రెండో శ్రేణి పెద్దలు కూడా ఉంటారు. ఒక్కో సందర్భంలో వీరి సలహాలు–సూచనలు తీసుకోవడం జరుగుతుంది. గ్రామ పెద్దరికం తరతరాలుగా వారసత్వంగా వస్తుంటుంది. అందులో పెద్దకొడుకుకు వారసత్వ ప్రాధాన్యత ఉంటుంది. పిల్లలు ఎవరు లేని పక్షంలో మేనల్లుడు సంప్రదాయం లేదా గ్రామపెద్ద ఎంపిక చేసినవారికి ఈ పెద్దరికం అప్పజెప్పడం జరుగుతుంది. గ్రామ పెద్ద పొలంలో మిగతావాళ్ళు కూలీ లేకుండా పనిచెయ్యడం, గ్రామానికి సంబంధించిన అన్నింటిలో అతడికి తొలి ప్రాధాన్యత, జ్యేష్ఠ భాగం ఇవ్వడం జరుగుతుంది. ఆర్థిక, సంప్రదాయ, సాంస్కృతిక కార్యక్రమాలలో పెద్ద పీట వెయ్యడం, అగ్రతాంబూలం కేటాయించబడుతుంది. అయా తెగలలో తలెత్తే సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసుకొన్న గ్రామ న్యాయ వ్యవస్థలో గ్రామ పెద్ద న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తాడు. ఈ సంప్రదాయం తరతరాలుగా సాగుతూ వస్తుంది. సామ్రాజ్య రాజుల కాలంలో కూడా వీరి కట్టుబాట్లకు విలువ ఇచ్చేవారు. విదేశీ పాలకులైన మొఘలులు, బ్రిటీషువారు వచ్చిన తరవాత కొంత అలజడులకి లోనయ్యారు. గిరిజనులు అమాయకులైన ఆత్మాభిమానం కలిగినవాళ్ళు. అందుకే అక్షర జ్ఞానం ఉన్న సమూహం కంటే ఎక్కువ తిరుగుబాట్లు, పోరాటయోధులు అధికంగా పుట్టుకొచ్చారు.

## ఆర్థిక విధానం:

పరిగణించిన పరిగణించక పోయినా ఆర్థికమన్నది మానవుల జీవితానికి అంతర్ సూత్రంగా పరిగణింప బడుతుంది. ఆర్థిక పరిస్థితి అందరి జీవన ప్రమాణాలను ప్రభావితం చేస్తుంది. తొలినాళ్ళలో ఏ విధమైన ద్రవ్య విధానం ఉండేది కాదు. అవసరాలను వస్తుమార్పిడి పద్ధతుల ద్వారా తీర్చుకోవడం జరిగేది. ఒక వైపు మిగతా సమాజం రాజ్యాలలో భాగంగా నాణేల రూపంలో ద్రవ్య వినిమయ పద్ధతులను భాగం చేస్తున్న వాతావరణంలో కూడా గిరిజనులు వస్తు మార్పిడిలోనే ఉండిపోయారు. ఇందుకు కారణం వారు ప్రధాన జీవన స్రవంతికి ఎడంగా ఉండడమే. ఒకరి ఆర్థిక పరిస్థితిని అంచనా వెయ్యడానికి వారి ఆహారోత్పత్తి సేకరణ, దినచర్యను ఆధారంగా చేసుకోవడం జరుగుతుంది. భారతదేశంలో గిరిజనుల ఆహారోత్పత్తి, దినచర్యను ప్రమాణంగా చేసుకొని మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. 1. వేట–అటవి ఉత్పత్తుల సేకరణ, 2. వేట–పోడు వ్యవసాయం, 3. వేట–పశుపోష ణ, వేట వారి ఆకలిని తీర్చుతుంది. మిగిలిన పనులు వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తాయి.

## గిరిజన ప్రజల తిరుగుబాట్లు:

స్వదేశీ రాజ్యాల రాజులతో గిరిజన ప్రజలకు కొంతమేరకు సంఘర్షణ మాత్రమే ఉండేది. విదేశీ పాలకుల వలన గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అప్పటివరకు గిరిజనులకే సహజమైన హక్కు కలిగిన అడవిపై ఒక్కసారిగా పరాయి భావనను కలిగించే చట్టాలను తీసుకొచ్చారు. అటవి ఉత్పత్తులపై పన్ను, నిషేధం, క్రిమినల్ జాబితాలలోకి కొన్ని సమూహాలను చేర్చడం వంటి చర్యలు అడవి బిడ్డలకు ఆగ్రహం తెప్పించాయి. ఆ ఆగ్రహం తిరుగుబాటుకు దారి తీసింది. మొన్నటి మొఘలు నుంచి నిన్నటి బ్రిటీషువారు, నేటి ఈశాన్య ప్రాంతాలలో చెలరేగుతున్న బోడో ల్యాండ్, సైనిక చట్టాల రద్దు వరకు వారిదైన నిరసనలు తిరుగుబాట్లు తలెత్తుతున్నాయి. కోల్ తిరుగుబాటు (1830), సంతాల్ తిరుగుబాటు (1856), ముండా తిరుగుబాటు (1897), నాగా తిరుగుబాటు, మిజో తిరుగుబాటు, బస్తర్ తిరుగుబాటు, రంప పితూరీ, కురియా పితూరీ, కొమరం జల్–జమీన్–జంగిల్ తిరుగుబాటు...

మొదలైన అనేక తిరుగుబాట్లు భారతదేశ చరిత్రలో దాగి ఉన్నాయి. దేశానికి స్వాత్రంత్యం సిద్ధించిన తరవాత కూడా ఎన్నో ఉద్యమాలు జరిగాయి. అందుకు గిరిజనేతరులు గిరిజనుల జీవితాలలోకి ప్రవేశించడం, వ్యాపారాత్మక విధానం, ఆధిపత్య ధోరణి, ప్రాజెక్ట్ పేరుతో నిర్వాసితులు కావడం వంటి చర్యలవల్ల తిరిగి గిరిజనులు ఉద్యమబాట పట్టారు.



### ఫూలో-ఝానో ముర్ము

**జననం: భోఘనాది, సాహెబ్ గంజ్, జార్ఖండ్| తెగ: సంథాల్ | వీరమరణం: 1856.**


బ్రిటీషువారికి వ్యతిరేకంగా పోరాడడానికి మగవాళ్ళు సైతం వెనకడుగు వేస్తున్న తరుణంలో గొడ్డలితో నిలబడిన గిరిజన వీరవనితలు ఫూలో– ఝానో ముర్ములు. వీళ్ళు వరసకు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు సిద్ధు–కన్హూ ముర్ములకు చెల్లెళ్ళు. వీరి కుటుంబం మొత్తం స్వాతంత్ర్య సమరంలో ప్రాణత్యాగం చేసినవారే. ఈ అక్కాచెల్లెళ్ళు బాల్యం నుంచే అబ్బాయిల మాదిరి ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి గుర్రాలపై తిరుగుతూ 'హాల్ తిరుగుబాటు' సందేశాన్ని పంచేవారు. వీళ్ళు ఏకంగా ఒక స్త్రీ సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని బలమైన సాల్ వృక్షం చాటుగా బ్రిటీష్ సైన్యంతో మెరుపు గెరిల్లా యుద్ధాలు చేసేవారు. వీరి అన్నల తరహాలోనే ఈ వీరవనితలు భారతావని కోసం యుద్ధభూమిలో 1856న కన్నతల్లి ఒడిలో ఒరిగారు. వీరుల మధ్యన చిరస్థాయిగా మిగిలిపోయారు.



### రాణి మా గైడిన్ల్యూ

**జననం: 26 జనవరి 1915, మణిపూర్ | తెగ: నాగా |వీర మరణం: 17 ఫిబ్రవరి 1993.**

గిరిజనులు ఎక్కువగా ఉన్న ఈశాన్య ప్రాంతాల నుంచి పోరుబాటపట్టిన నారీమణుల్లో రాణి మా గైడిన్యూ ఒకరు. మణిపూర్లోని తామేంగ్ లాంగ్ జిల్లాలోని నుంగ్కావో గ్రామంలో జన్మించిన గైడిన్యూ బాల్యం నుంచే స్థానిక ప్రజా చైతన్యంలో పాలుపంచుకొనేది. ముఖ్యంగా హరక్కా మత ఉద్యమంలో 13 ఏళ్ళలో చురుకుగా పాల్గొనేది. అటువంటి సాహసవంతురాలు కళ్ళముందు స్వాతంత్ర్య సమరం రాజుకొంటుంటే ఉరికే ఉంటుందా? తమ మణిపూర్ చుట్టుపక్కల ఉన్న బ్రిటీషువారిని తరిమి కొట్టటంలో ముందుండేది. ఆగ్రహించిన సైన్యం 16. సంవత్సరాల స్త్రీ అని చూడకుండా జైలుకి పంపారు.



### రాణి దుర్గావతి


**జననం: 5 అక్టోబర్ 1524, కలింజార్, బుందేల్‌ఖండ్, మధ్యప్రదేశ్ | తెగ : గోండ్ | వీర మరణం: 24 జూన్ 1564.**

రాణి దుర్గావతి తన పేరుకు తగినట్టుగా తేజస్సు, అందం, పరాక్రమ ధైర్యసాహసాలకు కూడా ప్రతీకగా నిలిచింది. రాజా దళపత్ షా మహారాణి అయిన దుర్గావతి మాల్వా పాలకుడైన బాజ్ బహదూర్ న్ను, ఢిల్లీ సుల్తాను అయిన షేర్ష్ సూరిను, మొఘల్ చక్రవర్తి అయిన అక్బర్ను కూడా యుద్ధభూమిలో ఎదుర్కొన్న గొప్ప వీరాంగన దుర్గావతి. వివాహానికి ముందు నుంచే తండ్రితో కలిసి వేటకు, బందిపోటు వారి అణిచివేతకు స్వయంగా వెళ్ళేది. అయిన తర్వాత కూడా కుమారి దుర్గావతి 1545లో ఢిల్లీ సుల్తాను అయిన షేర్ ను ఓడించి వధించింది. ఆ తరువాత ఘడ్ మండలా మహారాణిగా మాల్వా సుబేదారైన బాజ్ బహదూర్ను రెండు సార్లు ఓడించింది. 1564లో దుర్గావతి మొఘుల్ సైన్యం ముందు తలవంచడానికి నిరాకరించి జాతి ప్రతిష్ట స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకై యుద్ధభూమిని ఎంచుకుని పోరాడింది. మొఘుల్ సైన్యం పోరులో దుర్గావతి బాణాల పొదలలో ఇరుక్కుపోయింది. ఆఖరికి శత్రుమూక చేతిలో చావడానికి ఇష్టపడక గాయపడిన దుర్గావతి ఆఖరికి తన బాకుతో పొడుచుకుని చనిపోయింది. నుదిట నెత్తుటి తిలకం దిద్దుకొనే చేతితో తల్వారు పట్టిన దుర్గావతి ధైర్యం ఎప్పటికి ఈ నేలను వదిలిపోదు.

### సింగి దాయి

**జననం: రోహతాస్ ఘడ్, బీహార్ తెగ: ఉరావ్|వీర మరణం: తేదీ లభించలేదు**

ఉరావ్ గిరిజన తెగ వీరాంగన సింగి దాయి. ఈ పేరు వినగానే తన శౌర్యం, పరాక్రమ ప్రజ్ఞకు ఎవరైనా ఆశ్చర్యచకితులవుతారు. టర్క్లతో జరిగిన యుద్ధంలో తన సైన్యం చెల్లాచెదురైన సమయంలో కూడా ఆమె ఉరావ్ తన రాజ్యాన్ని స్వాధీనం చేసుకుంది. దేశ రక్షణలో పురుష సైనికులు ప్రాణత్యాగం చేస్తున్నా రాజ్యంపై పట్టు సడలుతుంది. అటువంటి నిస్సహాయ స్థితిలో రోహతాస్ ఘడ్ రాజు రూయిదాస్ కూతురైన రాకుమారి సింగి దాయి తన తెలివితేటలతో, ధైర్య సాహసాలతో ఉరావ్ సామ్రాజ్యాన్ని చేజారిపోకుండా కాపాడుకుంది. చెట్టు పుట్టనే దైవంగా భావించే గిరిజనులు ప్రాణాలను కాపాడిన సింగి దాయిని దైవంగా భావించడంలో ఏమాత్రం అతిశయోక్తి కాదు.



ప్రపంచ చరిత్రలో తెలంగాణ రైతాంగ పోరాటానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. యావత్తు దేశం తెల్లదొరలతో పోరాడుతుంటే తెలంగాణ మాత్రం ఒకవైపు నిజాం నిరంకుశపాలనను, స్థానిక పట్వారీ దోపిడిని ఎదుర్కొంది. ఈ పోరాటంలో ఎందరో తిరుగుబాటు పంథాలో విముక్తి కోసం ప్రాణాలు అర్పించారు. వారిలో జాటోతు ఠాను నాయక్ ఒకరు. వరంగల్లోని జాటోతు హేము, ముంగిబాయి అనే దంపతులకు ఆరుగురు మంది కొడుకులు, జోధ్య, సోప్ల, సాంక్రు, దర్వా, ఠాను, దాసు. అందులో ఒకడు ఠాను నాయక్. పిల్లలందరూ మంచి ధైర్యవంతులు, సాహసవంతులు. కార్యదీక్షలో అనుకున్నది సాధించే వరకు నిద్రపోయేవారు కాదు. నిజాం పాలనలో ఠాను నాయిక్ కుటుంబ భూమి కూడా స్థానిక దొరల వలన ఆక్రమణకు గురి అయ్యింది. ఇదే కాకుండా ధర్మాపురం, లక్ష్మక్కపల్లి, రామన్నగూడెం, రామవరం, మొండ్రాయి గ్రామాలలోని లంబాడీ గిరిజనుల భూములను కూడా దొరలు ఆక్రమించారు. "దున్నేవాడిదే భూమి" అన్న నినాదంతో కమ్యూనిస్టులు ముందుకు సాగుతున్న తరుణంలో ఠాను నాయక్ కుటుంబం మొత్తం ఎర్రజండాలతో పోరాటంలోకి దిగారు. వీరి కుటుంబంలోని అన్నదమ్ములే ఒక దళంలా, ఠాను నాయక్ కమాండర్ గా పనిచేశారు. నిజాం పాలనలో ఎన్నో కష్టాలు, ధన, మాన, ప్రాణ నష్టాలను అనుభవించారు. వాటిని చూస్తూ వచ్చిన ఠాను నాయక్ చేతికి తుపాకీ దొరికింది. ఈ గ్రామంలో దొరల ఆగడాలు సాగుతున్న గడీలను చుట్టుముట్టి వెట్టి చేసుకొనే వారికి విముక్తి కల్పించేవాడు. అదే తరుణంలో దొడ్డి కొమరయ్యను రజాకార్లు చంపిన

## జాటోతు ఠాను నాయక్

**జననం: తెలంగాణ |తెగ: లంబాడీ, మరణం: 20 మార్చి 1950.**

ఉదంతం తెలంగాణ మొత్తం అగ్గిలా వ్యాపించింది. అప్పటికే పోరాటంలో ఉన్న వీరికి అది మరింత అజ్యం పోసినట్టు అయ్యింది. "కమ్యూనిస్టు పార్టీకి జై' అంటూ పేద ప్రజల నుంచి ఆక్రమించుకొన్న భూముల్లో ఎర్ర జెండాలను నాటుతూ పోయారు. దొరల ఒత్తిడితో రజాకార్ల సైన్యం వారున్న తండాలపై కసితీర్చుకోనేది. ఒకరోజు ఠాను నాయక్ కుటుంబంపై బాబు దొర ముఠా దాడిచేసి ఆ రోజు దొరికిన ఠాను నాయక్ సోదరుడు సోమ్లా ఇంకో నలుగురిని పట్టుకొని సజీవ దహనం చేసారు. ఠాను నాయక్ ఆచూకీ కోసం అతడికి మద్దతు తెలుపుతున్న గ్రామాలన్నీ తగలబెడతూ వచ్చారు. ఠాను నాయక్ పోలీసులకు దొరకకుండా తప్పించుకొంటూనే దాడులు చేసేవాడు. ఫలితంగా పోలీసులకు ప్రత్యేక టార్గెట్ అయ్యాడు. చివరకు ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో మొండ్రాయికి సమీపంలో నున్న నీలిబండ తండాలో రాను నాయక్ అతని ఉద్యమ సహచరుడు కందూరు వెంకులును పోలీసులు పట్టుకొని మొండ్రాయి భూస్వాముల గడిలో ఒక బండి చక్రానికి కట్టేసి అతి కిరాతకంగా హింసించి తుపాకీ గుండ్ల ద్వారా ప్రాణాన్ని బలిగొన్నారు. రానునాయక్ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం నిజాం రజాకార్లను ఎదురించిన ధైర్యశాలి. రానునా




యక్ కమ్యూనిస్టు యోధుడే కాదు, తెలుగు, లంబాడీ భాషల్లో చక్కగా మాట్లాడి వేలాది మందిని చైతన్యపరిచి ఉద్యమాన్ని ఉరికించిన మంచివక్త. నేటికీ మొండ్రాయి తండాల్లో ఆ వీరుడి విగ్రహం సగర్వంగా సమరానికి సిద్ధం అన్నట్లుగా ఉంటుంది.

## లఖిషా బంజారా

**జననం: 4 జూలై 1580, ఢిల్లీ| తెగ: బంజార|వీర మరణం: 7 జూన్ 1680,**


బ్రిటీషు పాలనలోనే కాకుండా మొఘలుల పాలనలో కూడా అస్తిత్వం దెబ్బతిన్నది. మొఘలులు ఉత్తర భారతదేశంలో పరిపాలన బలంగా కేంద్రీకృతమై ఉన్న కాలంలో వారి హింసాత్మక దాడులకు వ్యతిరేకంగా పోరాడిన వాళ్ళలో లఖిషా బంజారా ఒకరు. ఆసియాలోనే అతిపెద్ద ధనవంతుడు. పశుగణంతో కూడిన రవాణా వ్యాపారి. వస్తుమార్పిడి కాలంలో విదేశాల నుంచి భారతదేశానికి, భారతదేశం నుంచి విదేశాలకి వస్తు రవాణా చెయ్యడం తరతరాలుగా వీరి కుటుంబానికి వస్తున్న ఆచారం. లఖీషా బంజారాకు ఢిల్లీలో నాలుగు తండాలు (మల్చా, రైసినా, బహరంబ, సరేలా) వ్యాపార నిమిత్తం ఉండేవి. తొలి నాళ్లలో మొఘల్ సైన్యానికి అవసరమైన సున్నపురాయి, వంతెనలు, స్టిరప్, పత్తి, కాల్షియం హైడ్రాక్సైడ్ సరఫరా చేసేవారు. 50,000 ఎద్దులబండ్లు, 3,00,000 సాయుధ కాల్బలం ఉండేవి. ఆసియా నుండి భారతదేశానికి వస్తువులను దిగుమతి– ఎగుమతి చేసేవాడు. ఇవే కాక వ్యవసాయ ఉత్పత్తులు, నిర్మాణ వస్తువులు, పశువు సంపద మార్పిడి చెయ్యడం కూడా అతని వ్యాపారంలో ప్రధాన భాగం. తాత నాయక్ ఠాకూర్ కాలం నుంచి మొఘలులతో సఖ్యతతో ఉంటూ వస్తున్నా లఖిషా బంజారా కాలం నాటికి వ్యవహారం చెడి కయ్యానికి దారితీసింది. ఇందుకు సిక్కు మతస్థులు ఉన్న ప్రాంతంలో మొఘలులు అలజడులు సృష్టించడం, సిక్కువారికి లఖిషా బంజారాకి అత్యంత సాన్నిహిత్యంతో పాటు స్థానిక ప్రజలపై మొఘలుల అణచివేత కూడా కారణం. మొఘలుల అణచివేతకు వ్యతిరేకంగా గురునానక్. బాబా బందా సింగ్ బహదూర్, భాయ్ గురుదాస్ గురు హరగోవింద్, పదవ సిక్కు గురువు గురు గోవింద్సంగ్లు 1700 నుండి 1704 వరకు పోరాడుతూ వీరమరణం పొందారు. తర్వాత వచ్చిన సిక్కు యోధులకు మొఘలులపై నిరంతర పోరాటంకై ఓ కోట అవసరం అయ్యింది. ఆ కోట నిర్మాణ బాధ్యతలు



లఖిషా బంజారా తీసుకొన్నాడు.. ఎప్పటికీ చెక్కు చెదరని అతి పెద్ద 'లోహ ఘర్' కోటను కూడా నిర్మించాడు. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబుతో పోరాడే శక్తి కలిగించడంలో లోపఘర్' కోట ఒకటి. సిక్కుల పోరాటంకే కాకుండా వారి మతాభివృద్ధికి కూడా లఖిషా బంజారా ఎంతో సహకరించాడు. ఇతడి ప్రస్తావన వారి పవిత్ర గ్రంథమైన 'గురు గ్రంథ్ సాహిబ్'లో కూడా ఉంది. ఈ ప్రయాణంలో లఖిషా బంజారా ఆస్తితోపాటు చాలా త్యాగాలు చేశాడు. కేవలం ఇదంతా మాతృభూమిపై ఉన్న మమకారంతోనే సాధ్యమయ్యింది. 99 ఏళ్ళ సంపూర్ణ జీవితం గడిపి లఖిషా బంజారా 7 జూన్ 1680న మరణించాడు. ఎర్రకోట నిర్మాణంలో లఖిషా బంజారా తాతగారైన నాయక్ రాకూర్, లోహ ఘర్ కోట నిర్మాణానికి భాయ్ లఖిషా బంజారా ప్రధాన భూమికగా నిలిచిన తీరును ఇప్పటికి చరిత్రపారంగా దేశం చదువుకుంటుంది.

## మల్లు దొర

**జననం: 1990 చింతపల్లి |తెగ: కోయ|మరణం: 1969.**



మన్యం పోరాటాన్ని చంద్రయ్య, అల్లూరి సీతారామరాజు తర్వాత వారసత్వంగా ప్రజలలోకి తీసుకొని పోయినవాళ్ళలో మల్లుదొర ప్రము ఖుడు. చింతపల్లి తాలూకాలోని బట్టపనుకులు గ్రామంలో జన్మించాడు. తండ్రి గాము గంటందొర బట్టపనుకులు గ్రామానికి మునసబుగా పనిచేసేవాడు. బాల్యంలో అన్న బొగ్గుదొరతో కలిసి చుట్టుపక్కల గ్రామాలకు స్వేచ్ఛగా తిరిగేవారు. వారి ఆటపాటలలో బ్రిటీషు దొరల దోపిడీ అనుభవంలోకి వచ్చింది. దేశం కానీ దేశంలో బతుకు తెరువుకు వచ్చి ఇక్కడి బతుకులను అక్రమ రవాణా చెయ్యడాన్ని ఓర్చుకోలేకపోయాడు. అన్న బొగ్గుదొరతో కలిసి వారి అక్రమచర్యలకు నిరసన తెలిపేవారు, దీనికి ప్రతిగా బ్రిటీషువారు గూడెం తాహశీల్దారు బాస్టియన్ ప్రభుత్వాన్ని ధిక్కరిస్తున్నారనే వ్యాజ్యంతో తండ్రి గంటందొరను మునసబు పదవి నుండి, పనినుండి తొలగించాడు. వారి భూములను సైతం ప్రభుత్వపరం చేసుకొంది. అప్పటికే ప్రజాపోరాటం మొదలు పెట్టిన అల్లూరి సీతారామరాజుతో కలిసి నడవడానికి ముందుకు వచ్చారు. వారి ఆగడాలను అంతమొందించడానికి 150 మందితో ఏర్పాటు చేసిన సైన్యంలో మల్లుదొర ముందువరసలో ఉండేవాడు. తమ గురించి అధికారులకు తెలియజేస్తున్నాడన్న అనుమానంతో ఒక ప్రభుత్వ గూఢచారిని మల్లుదొర కాల్చివేసిన సంగతి అల్లూరి దృష్టికి వచ్చింది. దీనికి ఆగ్రహించిన అల్లూరి వెంటనే ఆయుధాలను అప్పచెప్పి దళాన్ని విడిచి వెళ్ళవలసిందిగా మల్లుదొరను రాజు ఆజ్ఞాపించాడు. మల్లుదొర రాజు ఆజ్ఞను, శిరసావహించి 1923 సెప్టెంబరు 17న నడింపాలెం వెళ్ళాడు. అక్కడ తన ప్రేయసి గృహంలో ఉండగా బ్రిటీషువారికి పట్టుబడ్డాడు. అల్లూరి ఆచూకీ తెలుపమని మల్లుదొరను దారుణంగా హింసించినా అతనేమీ తెలియజేయలేదు. వాల్తేరు ఏజన్సీ న్యాయమూర్తి మల్లుదొరకు మరణ దండన విధిస్తూ 1924 అక్టోబరు 23న తీర్పు చెప్పారు. మల్లుదొర అప్పీలు చేయగా మరణశిక్షను ద్వీపాంతరవాస ఖైదుగా మార్చబడింది. మే 8, 1924 తేదీన అల్లూరి వీర మరణంతో అతని అనుచరులు విజృంభించారు. బ్రిటీష్ ప్రభుత్వం అతిక్రూరంగా పలువురు యోధులను హతమార్చింది. గంటందొర, కొద్దిమంది అనుచరులు సైనికులతో భీకరంగా పోరాడి వీరమరణం పొందారు. సీతారామరాజు ప్రధాన అనుచరులలో బ్రతికి బయటపడింది. మల్లుదొర ఒక్కడే. అండమాన్ జైలులో పదమూడున్నర ఏళ్ళు గడిపిన మల్లుదొరను 1947లో ఏర్పడిన కాంగ్రెసు మంత్రివర్గం విడుదల చేసింది. భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత లంక సుందరంగారి చొరవతో 1952 ఎన్నికలలో విశాఖపట్నం నుండి గెలుపొంది మల్లుదొర లోక్సభ సభ్యుడయ్యాడు. స్వాతంత్ర్య అనంతరం కూడా ప్రజాపోరాటంలో తనువు చాలించిన మల్లుదొరకు ఈ భరతభూమి సదా రుణపడి ఉంటుంది.

## రాణి రోపుయిలియాని

**జననం: 1828 మిజోరాం | తెగ: మిజో కమ్యూనిటీ | వీర మరణం: 3 జనవరి 1895.**

ఒక సాహసవంతుడికి పుట్టిన సాహసవంతురాలు మిజోరం రాజు లాల్సవుంగా కుమార్తె అయిన రాణి రోపుయిలియాని, స్వాతంత్ర్యం కోసం మిజోరాం నుంచి పోరాడిన యోధురాలు రోపుయిలియాని, తేయాకు తోటలపై 1890లో మిజో ప్రాంతాలపై బ్రిటీష్ వారి ఆక్రమణ మొదలైంది. వారిని సవాలు చేస్తూ వారి ఆదేశాలను ధిక్కరించేలా మిజోరాం ప్రజలను పోరుకు ప్రేరేపించింది రోపుయిలియాని, తన భర్త మరణాంతరం రాణిగా బాధ్యతలు స్వీకరించి తన గ్రామమైన రాలవాంగ్ నుండి తన పరిపాలన సాగించేది. రాణి రోపుయిలియాని మిజో తిరుగుబాటుకు నాయకత్వం వహించి మిజో ప్రజల ఐక్యతకు చిహ్నంగా మారింది.





## బిర్సా ముండా


**జననం: 15 నవంబర్ 1875, ఉలిహాతు, ఖూంటి, జార్ఖండ్ |తెగ ముండా |వీర మరణం: 5 జూన్ 1900.**

భారత స్వాతంత్ర్య సమరయోధుల్లో ఎవరినైనా దేవుని అవతారంగా భావించారంటే అది మహోన్నత విప్లవవీరుడు బిర్సా ముండానే. దేశచరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిన వీరుడు భగవాన్ బిర్సాముండా. దేశ పరాధీనత నుంచి స్వాధీనతకు అడుగులు వేయించబూనిన బిర్సా ముండా 'అబుఆ దిశోం అబుఅ రాజ్' అనగా, 'మన దేశం మన పాలన' అనే నినాదాన్నిచ్చాడు. ఆ స్వరాజ్య నినాదంతో 'ఉల్గులాన్' ఉద్యమాన్ని ప్రారంభించాడు. తమ గిరిజన సంస్కృతి సంప్రదాయాలను కాలరాస్తున్న బ్రిటీషు సైన్యంపై సాయుధపోరాటం చేసి వారిని హడలెత్తించాడు. డోమ్బారీ కొండను స్థావరంగా చేసుకొని దాడులు చేసేవాడు. వీరుడైన భగవాన్ బిర్సాముండా ప్రభావం జార్ఖండ్ తోపాటు ఒడిశా, ఛత్తీస్ ఘడ్, మహారాష్ట్ర, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో కూడా ఉండేది. ఆయన స్వరాజ్యాన్ని, స్వధర్మాన్ని కాపాడుకోవడానికి తన జీవితాంతం పోరాడాడు. 3 ఫిబ్రవరి 1900న చక్రధర్పూర్ అడవిలో జరిగిన కాల్పుల్లో అరెస్ట్ కాబడ్డాడు. ఆ తరువాత 5 జూన్ 1900న బ్రిటీషు నిర్బంధంలోనే తుదిశ్వాస విడిచాడు. వీరుడిగా ఎదిగిన బిర్సాముండా ప్రజలకు దేవుడిగా కొలువై ఉన్నాడు. ఇతడి త్యాగాన్ని స్ఫూర్తిని గుర్తించిన భారత ప్రభుత్వం బిర్సా ముండా జయంతిని (నవంబర్ 15) 'జనజాతి గౌరవ దివాస్'గా అధికారికంగా ప్రకటించింది.

## సోయం గంగులు

**జననం: 1918 - ప్రాంతం: ఖమ్మం, తెలంగాణ | తెగ: కోయ | వీరమరణం: 12 మే 1951**

తెలంగాణాలో ఉత్తర తెలంగాణ గిరిజనుల పోరాటపటిమ వేరే. కొమరం భీం, రాంజీ గోండు తర్వాత స్వజాతి అస్తిత్వ పోరాటాన్ని వారసత్వంగా అందుకున్నవాడు సోయం గంగులు. ఖమ్మంలోని జమేదారు బంజార అనే (దమ్మపేట–మండలం) కోయగూడెంలో సోయం పాపమ్మ – రామయ్య దంపతులకు జన్మించాడు. బాల్యం నుంచే పోరాట నాయకత్వం కూడుకున్న తిరుగుబాటు ధోరణి కలిగినవాడు. నచ్చిన అమ్మాయిని మనువాడడంలో భాగంగా జీవికకోసం ఏలూరు ప్రాంతానికి (ఆంధ్ర) వెళ్ళిన గంగులుకు అక్కడే ప్రజాపోరాటాలకు తగిన బీజం పడింది. స్థానికంగా బాలానంద స్వామి, సింగరాజులు కమ్యూనిస్టు కార్యక్రమాలు నిర్వహించేవారు. సహజంగానే గంగులు ఆకర్షితుడు, సభ్యుడు కావడం జరిగింది. ఆ పోరాట స్ఫూర్తితో నిజం రాష్ట్రంలో స్థానికంగా జరుగుతున్న అక్రమాలపై పోరాడడం, జీతగాళ్ళ వెట్టిచాకిరి విముక్తి, కూలీల రేట్లు పెంచడం, ప్రజాకోర్టు నిర్వహణతో పీడితుల కోసం సాయుధపోరాటం కొనసాగించాడు. నిజాంపాలన తర్వాత భూస్వామ్యవాదులు కాంగ్రెసులో చేరి ప్రజలను ఇబ్బంది పెడుతుంటే స్వాతంత్ర్య దేశంలో కూడా మళ్ళీ ప్రజలకోసం సాయుధుడయ్యాడు. అతడి నుంచి ప్రజల్లో వస్తున్న మార్పును జీర్ణించుకోలేని పెట్టుబడిదారులు గంగుల ఆప్తులతోనే నమ్మకద్రోహం



చేయించి తాగినమత్తులో ఉన్నప్పుడు బంధించి 12 మే 1951న చెట్టుకు కట్టి కాల్చి చంపారు. ఇప్పటికీ సోయం గంగుల జ్ఞాపకాలు ప్రజల్లో సజీవంగా ఉన్నాయి. అతడి నెత్తురు ఇచ్చిన పోరాట పటిమ కోయ తెగలో ప్రవహిస్తూనే ఉంది.


## చంద్రయ్య దొర

**జననం: లభించలేదు. తూర్పుగోదావరి తెగ: కోయ | వీర మరణం: 23 ఫిబ్రవరి 1880,**

అల్లూరి సీతారామరాజు కంటే ముందే మన్యం ప్రాంతాలలో సమరశంఖం పూరించిన తెలుగు వీరుడు ద్వారబంధాల చంద్రయ్య, కోయ తెగకు చెందిన చంద్రయ్య తూర్పుగోదావరి జిల్లా తొలి స్వాతంత్ర్య సమరయోధుడు. తూర్పు గోదావరి జిల్లా మన్యంలోని శంఖవరం మండలం నెల్లిపూడి గ్రామంలో జన్మించాడు. బాల్యం నుంచే మేనమామల సహకారంతో యుద్ధ విద్యలైన కర్రసాము, విలువిద్య, కుస్తీతో పాటు తుపాకీ పేల్చడం కూడా నేర్చుకొన్నాడు. ఆయుధ విద్య నేర్చిన వీరుడు ప్రజల ప్రయోజనార్థం వినియోగిస్తాడు. చంద్రయ్య కూడా అప్పటి వరకు బ్రిటీషు వారు జరుపుతున్న ఆగడాలకు విసుగు చెంది ప్రజా ఉద్యమానికి 1879లో తెరలేపాడు. తన తిరుగుబాటుకు బురదకోటను స్థావరంగా చేసుకొని వారిపై పోరాటం చేశాడు. ఈ తిరుగుబాటు చరిత్రలో రంప పితూరీగా పేరుగాంచింది. ఈయన పోరాటానికి పులిచింత సాంబయ్య, అంబుల్రెడ్డిల సహకారంతో సామ్రాజ్యవాదుల దోపిడికి వ్యతిరేకంగా ప్రజలని సైతం భాగంగా చేశాడు. 1879 ఏప్రిల్ అడ్డతీగెల పోలీసు స్టేషనును ధ్వంసం చేశాడు. రంపచోడవరంలో ప్రారంభమయిన ఈ పితూరీ కొద్ది రోజుల్లోనే



భద్రాచలం, రేకపల్లి, గోలుకొండ ప్రాంతాలకు విస్తరించింది. ఈ చర్యకు ఆగ్రహించిన బ్రిటీషు వారు అదే సంవత్సరం చంద్రయ్య అతని అనుచరులు సుమారు 79 మందిని కాల్చివేసింది. అమాయక ప్రజల ప్రాణాలని తీసినారన్న కసితో చంద్రయ్య మరింత రెచ్చిపోయి వారిపై దాడులు చేశాడు. ఒకవైపు బ్రిటీషువారిని ఎదుర్కొంటూనే వీరికి తొత్తులుగా వ్యవహరిస్తున్న చింతలూరు, పెద్దిపాలెం, కిర్లంపూడి, చిల్లంగి, జగ్గంపేట జమీందారులపై కూడా తిరుగుబాట్లను జరిపాడు. ప్రజాకంటకులుగా మారిన వారిని అక్కడికక్కడే గొడ్డలితో నరికివేసేవాడు. చంద్రయ్యను నిలవరించకపోతే తమ మనుగడకే ప్రమాదం అని భావించిన బ్రిటీషువారు 1880 ఫిబ్రవరి 12న చంద్రయ్యగారికి చాలా నమ్మకస్తునిగా, అనుచరునిగా ఉండే జంపా పండయ్య అనే వ్యక్తిని బ్రిటీషు అధికారులు లోబరుచుకుని చంద్రయ్యని చంపడానికి సహకరించాలని కోరి తినే అన్నంలో మత్తు మందు కలిపి ప్రాణాలతో పట్టుకొనేలా చేశారు. చంద్రయ్యని 1880 ఫిబ్రవరి 12వ తేదీన అందరి సమక్షంలో చెట్టుకు కట్టేసి కాల్చి చంపారు. ప్రజల కోసం చివరి వరకు పోరాడిన యోధుడి జీవితం చంద్రయ్యది. ఆయన ఇచ్చిన స్ఫూర్తితో అల్లూరి సీతారామరాజు వీరి తరుపున పోరాడాడు. ఒక పోరాటం వీరమరణం చెందినవారి కొనసాగింపుగా కనిపిస్తుంది. అందుకు సాక్ష్యం రంప పితూరీకి జీవం పోసిన చంద్రయ్య జీవితం.




## తెలంగా ఖడియా

**జననం: 09 ఫిబ్రవరి 1806, గుమ్లా, జార్ఖండ్ | తెగః ఖడియా వీర మరణం: 23 ఏప్రిల్ 1880.**

దేశం కోసం సర్వస్వం త్యాగం చేసినవారిలో తెలంగా ఖడియా ప్రముఖుడు.

## మర్రి కామయ్య

**జననం: గరుడపల్లి, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ | తెగ: కొండ దొర |వీర మరణం: 5 మే 1959,**




అల్లూరి సీతారామరాజు తర్వాత ఆంధ్రప్రదేశ్ నుంచి ఆంగ్లేయులను ఎదుర్కొన్న గొప్ప యోధుల్లో ఒకరు మర్రి కామయ్య. ఈయన 1930 లో విశాఖపట్నం జిల్లాలో పాడేరు ప్రాంతంలో మోతుబరి రైతు. గిరిజనుల అమాయకత్వం, దారిద్రం పారద్రోల్గడానికి తనవంతుగా ప్రయత్నం చేసేవాడు.

## జత్రా టానా భగత్

**జననం: 1888, చింగ్రి, నావ్ టోలీ, గుమ్లా, జార్ఖండ్ | తెగ: ఉరావ్ | వీరమరణం: 1916.**

భగవాన్ బిర్సాముండా నిర్యాణ అనంతరము అతడి పోరాటస్ఫూర్తిని ముందుకు నడిపించినవాడు జత్రా టానా భగత్, జార్ఖండ్లో 'భారతదేశ సత్యాగ్రహ మార్గదర్శకుడిగా జత్రా టానా భగత్ను కొనియాడుతారు. గుమా ప్రజలు ఆయనను గౌరవంగా 'టానా భగత్' అని పిలిచేవారు.



## గుండాధుర్

**జననం: నేత్నార్, బస్తర్, ఛత్తీస్ ఘడ్ | తెగః ధుర్వా | వీర మరణం: తేదీ తెలియదు.**




ఛత్తీస్ ఘడ్ తాంత్యాతో పేగా, 'భూమ్కాల్ క్రాంతి' వీరుడిగా పేరు గాంచినవాడు గుండాధుర్. ఇతను గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు.

## మాద్రీ కాలో

**జననం: 1848, సుందర్ఘడ్, ఒడిశా | తెగః భుయ్యా | వీర మరణం: 1914.**

చోటానాగపూర్ లోని గన్ప్పూర్ రాష్ట్రంలో జన్మించిన వీరుడు మాద్రీ కాలో. ఇతను ఆ ప్రాంతంలో పెద్ద జమీందారు. ఆయన ప్రజలపై సానుకూల దృక్పథం కలిగినవాడు.



## లక్ష్మణ్ నాయక్

**జననం: 22 నవంబర్ 1899, కోరాపుట్, టెంటులిగ్మా, ఒడిశా | తెగః భూమియా | వీర మరణం: 29 మార్చ్ 1943.**

ఒడిశాలోని భూమియా తెగకు చెందిన గొప్ప స్వాతంత్ర్యయోధుడైన లక్ష్మణ్ నాయక్. ఇతడు మల్కాన్ గిరి గాంధీగా ప్రసిద్ధి చెందాడు.





## శంబూధన్ ఫూన్లో

**జననం: 1850, లోంగోభోర్, అస్సాం | తెగ దిమాసా | వీర మరణం : 2 ఫిబ్రవరి 1883.**

తొలి మహాసంగ్రామం (1857) ముగిసిన తరువాత కూడా దేశంలోని వివిధ ప్రాంతాలలో తిరుగుబాటు తత్వం మారలేదు. ముఖ్యంగా గిరిజన సమాజం. బ్రిటీషు పాలన నుండి విముక్తికై పోరాడుతూనే ఉండేది. ఆ జాతీయ పోరాటంలో ధైర్యవంతుడైన యోధుడు శంబూధన్ ఫూన్లో.



## తాంత్యా భీల్


**జననం: 1842, బడ్డా, పంధాన, ఖండ్వా, మధ్యప్రదేశ్ | తెగ: భీల్ | వీర మరణం : 4 డిసెంబర్ 1889,**

తొలి సంగ్రామాన్ని (1857) బ్రిటీషువారు ఎంతో కష్టపడి అణచివేశారు. అయినా కొద్దిరోజులకే అక్కడ మరో పోరాటయోధుడి ద్వారా మళ్ళీ స్వాతంత్ర్య జ్వాలలు ఎగిసిపడ్డాయి.

## నానక్ జీ భీల్

**జననం: 1890, బరడ్, రాజస్థాన్ | తెగః భీల్ | వీర మరణం: 13 జూన్ 1922,**

అమర్ హుతాత్మ నానక్ భీల్ బాల్యం నుంచే తన తెలివితేటలను, ధైర్యసాహసాలను ప్రదర్శించాడు. అది క్రమక్రమంగా బ్రిటీషువారిపై యుద్ధం చెయ్యడానికి బాటలువేసింది. భీల్ గోవింద్ గురు, మోతీలాల్ తేజావత్ నేతృత్వంలోని నడిచే ఉద్యమాన్ని నానక్ తన సాహసాలతో ప్రభావితం చేసేవాడు.



## హుతాత్మ కేసరి చంద్

**జననం: 1 నవంబర్ 1920, జాన్సూర్, ఉత్తరాఖండ్ | తెగ: జౌన్సారి | వీర మరణం: 3 మే 1945.**

నేతాజీ సుభాష్ చంద్రబోస్ దేశ యువతకు పిలుపునిచ్చినపుడు గిరిజన సమాజ యువకులు కూడా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనడానికి ఆసక్తి కనబరిచారు.






## బస్తర్ వీరుడు ప్రవీణ్ చంద్ర భంజ్ దేవ్

**జననం: 25 జూన్ 1929 బస్తర్ తెగ: మరణం: 25 మార్చి 1966,**

భారతీయ స్వాతంత్ర్య పోరాటం ఎంత గొప్పదంటే శాంతి కాముకులు అయిన ఆధ్యాత్మికవాదులను కూడా ప్రజాపోరాటాలలోకి తీసుకు వచ్చింది. అలా వచ్చిన వారిలో ప్రవీర్ చంద్ర ఒకరు.

నినాదం
నిఖార్సైన జర్నలిజం



## తలక్కల్ చందు

**జననం: తొండర్నాడ్, వయానాడ్, కేరళ | తెగః కురిచియ | వీరమరణం: 15 నవంబర్ 1805.**

భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో వయానాడ్కు (కేరళ) చెందిన 'కురిచియ' గిరిజన తెగకు ప్రత్యేకమైన స్థానముంది. అందుకు కారణం ఈ తెగ నుంచి వచ్చిన వీరోచిత పోరాటయోధుడు తలక్కల్ చందు.

## తిల్కా మాంఝి



**జననం: 11 ఫిబ్రవరి 1750, తిలక్పూర్, సుల్తాన్ గంజ్, బిహార్ | తెగః సంతాల్ | వీరమరణం: 18 జనవరి 1785.**

మాతృదేశ దాస్యవిముక్తి పోరాటంలో పాల్గొన్న మరో బీహార్ గిరిజన వీరుడు తిల్కా మాంఝి. ఈయన సంతాలీ తెగకు చెందినవాడు. బ్రిటీషువారి 'విభజించు పాలించు' విధానాన్ని మొదట పసిగట్టిన రాజనీతిజ్ఞుడు.



## వీర్ బుద్ భగత్

**జననం: 17 ఫిబ్రవరి1792, సిలగై, రాంచి, జార్ఖండ్ |తెగ: ఉరాన్ వీరమరణం: 13 ఫిబ్రవరి 1832,**

దేశ స్వాతంత్ర్య చరిత్రలో 'కోల్ తిరుగుబాటు'కు ప్రత్యేక స్థానం ఉంది. కారణం సిపాయిల తిరుగుబాటు కంటే ముందు జరిగిన తిరుగుబాటు. ఈ తిరుగుబాటుకు అద్యుడు వీర్ బుద్ భగత్, వనవాసి అవ్వడం ద్వారా బాల్యం నుంచే సైనిక వ్యాయామ శరీరం కలిగి ఉండేవాడు.

## సిద్ధూ- కన్హుముర్ములు



**జననం: సిద్ధూముర్ము- 1815, కన్హుముర్ము -1820, లోగ్రదిహు, భోగ్నాది, జార్ఖండ్ తెగ: సంథాల్ | వీరమరణం: 26 జూలై 1856,**

భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడ్డ అన్నదమ్ముల పేర్లు సిద్ధు కన్హు ముర్ములు. వాస్తవానికి సిద్ధూ, కను, చాంద్, భైరవ్ అనే వీళ్ళు నలుగురు అన్నదమ్ములు. గొప్ప యోధులైన ఆ నలుగురు సోదరులు గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా, స్వదేశీ పాలనకు సంరక్షకులుగా ఉండేవారు. దేశమంతటా వ్యాపించినట్లే ఈ సంతాల్ గిరిజన ప్రాంతాన్ని కూడా బ్రిటీష్వారి దోపిడీ, దౌర్జన్యాలు అలుముకున్నాయి. ఆత్మగౌరవం, శౌర్యం కలిగిన గిరిజన బిడ్డలు 'ఇది మా భూమి' అన్న నినాదంతో వారిని ప్రతిఘటించారు.



## చక్రబిషోయ్

**జననం: 1823, చక్రఘర్, గంజాం, ఒడిశా | తెగ: కంద| వీరమరణం: 1856.**

భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో 'కంద' గిరిజన తెగకు ప్రత్యేక స్థానముంది. ఆ గిరిజనుల పాత్ర ఒక సువర్ణ అధ్యాయంగా లిఖించబడింది. కందతెగ ప్రజలు బ్రిటీష్ వారితో 1835 నుండి 1865 వరకు పోరాడారు.

## మహువ కోల్



**జననం: మధ్యప్రదేశ్ | తెగ : కోల్ | వీరమరణం: అందుబాటులో లేదు.**

ధైర్యవంతుడు, శక్తివంతుడైన మహసింగ్ను కోల్ గిరిజన తెగ ప్రజలు మాత్రం 'మహువ కోల్' అని పిలుస్తారు. రూపురేఖలలో మహాభారతాన భీముడిని పోలి ఉంటాడు.



## రఘునాథ్ సింగ్ మండ్లోయి

**జననం: ఐరూద్, ఐర్వాని, మధ్యప్రదేశ్ | తెగః భీలాల | వీరమరణం: 8 అక్టోబర్ 1858.**

మాల్వా ప్రాంతానికి (మధ్యప్రదేశ్) చెందిన ఒక ప్రముఖ విప్లవకారుడు రఘునాథ్ సింగ్ మండ్లోయి. ఎదుటివారిని ఆకట్టుకొనే వ్యక్తిత్వం, ఎనలేని ధైర్య సాహసాలకు మండ్లోయి ప్రతీక. సొంత గ్రామంలో బ్రిటీషువారు.

## వెంకటప్ప నాయక్



**జననం: సుర్పూర్, కర్ణాటక| తెగ: బెరాడ్ | వీరమరణం: తెలియదు.**

కస్తూరి కన్నడలోని సుర్పూర్లో పుట్టిన వీరుడు రాజా వెంకటప్ప నాయక్. నాయక్ తన బాల్యం నుంచే దేశభక్తి కలిగినవాడు. అందుకే తనలో స్వాతంత్ర్య కాంక్ష సహజంగా ఏర్పడింది. స్థానిక రాజుగా ఉంటూ పొరుగు రాజుల్ని కలుపుకొని బ్రిటీషువారిపై యుద్ధం ప్రకటించాడు.




## డేలాన్ షా

**జననం: 1802, మదన్పూర్, నర్సింగ్పూర్, మధ్యప్రదేశ్ | తెగః గోండ్ | వీరమరణం: 16 మే 1858.**

మధ్యప్రదేశ్లోని బుందేల్ ఖండ్ ప్రాంతంలో గోండు గిరిజనులు అధికం. అడవిని నమ్ముకొని బతుకుతున్న గిరిజనులకు బ్రిటీషువారి చట్టాలు పోడు వ్యవసాయంలో ఇబ్బందులు సృష్టించాయి. నియంత్రణకు నీడలా తిరుగుబాటు ఎదుగుతుంది. అలా ఎదిగిన గిరిజన వీరుడు డేలాన్ షా.

## నాగ్యా మహాద్ కాత్కరి



**జననం: చిర్నేర్, రాయగడ్,మహారాష్ట్ర | తెగ: కాత్కరి | వీర మరణం: 25 సెప్టెంబర్ 1930.**


బ్రిటీషువారికి ఈ దేశంలో అధికారం చెజిక్కించుకొన్న తర్వాత అడవి నుండి అటవీ ఉత్పత్తుల సేకరణను నిషేధించే చట్టాన్ని తీసుకొచ్చింది. ఇది గిరిజన ప్రజల జీవనోపాధిపై తీవ్రప్రభావం చూపించింది. అడవిలో కట్టెలు అమ్ముకొని జీవిస్తున్న మహాద్ కాత్కరి కుటుంబంపై మరింత ఎక్కువ ప్రభావమే చూపింది.



## హైపా జాదోనాంగ్

**జననం: 1905, మణిపూర్ | తెగ: రోంగ్మయి నాగా | వీర మరణం: 29 ఆగస్ట్ 1931.**

ధర్మ రక్షతి, ఆధ్యాత్మిక చింతన, సాధు జీవనం భారతీయ జీవితంలో సనాతనంగా వస్తూ ఉన్నదే. ప్రజలు విపత్కర పరిస్థితుల్లో ఉన్నపుడు ఋషులు సైతం పోరుబాట పట్టిన సందర్భాలు చరిత్రలో అధికంగా ఉన్నాయి.. అందులో పేర్కొదగిన ఋషి పుంగవుడు హైపా జాదోనాంగ్.



## కొమరం భీమ్

**జననం: 22 అక్టోబర్ 1901, సంకెపల్లి, తెలంగాణ | తెగ: గోండ్ | వీర మరణం: 1940,**

భారతదేశాన్ని 'తెల్ల' మేఘాలు అల్లుకొని ఉంటే తెలంగాణ ప్రాంతాన్ని నిజాం మేఘాలు అలుముకొని ఉన్నాయి. నిజాం బ్రిటీషు వారికంటే కదు రాక్షసుడు. అటువంటి సమయంలో జల్ (నీరు), జంగల్ (అడవి), జమీన్ (భూమి) నినాదంతో పోరు మొదలుపెట్టిన మొట్టమొదటి ఉద్యమకారుడు కొమరం భీమ్. అప్పటి నిజాం రాష్ట్రంలోని ఆసిఫాబాద్ ప్రాంతంలోని సుంకేపల్లిలో 1900లో జన్మించాడు కొమరం భీమ్. గెరిల్లా పోరుకు గోందు దండును సిద్ధం చేసి మరోమారు నిజాంపై పోరు మొదలుపెట్టాడు. ఈ తిరుగుబాటుతో ఎన్నో గ్రామాలలో వెలుగును నింపాడు. బల్లెం వదిలి తుపాకులు చేతబూని నిజాం ప్రభుత్వానికి కొరకరాని కొయ్యగా తయారయ్యాడు. 1940 అశ్వినీ పూర్ణిమ రోజున వెన్నంటి నిలిచే అనునయూల్లో ఒకరు నిజాంకు కొమ్ము గాసి వెన్నుపోటు పొడిచారు. భీం ఆచూకి తెలుసుకున్న నిజాం సైన్యాలు భీం దేహాన్ని తూట్ల జల్లెడగా మార్చేశారు. ఇలా స్వేచ్ఛాయుత జీవితం కోసం అమరుడైన కొమరం భీమ్ గోందులకే కాదు యావత్తు దేశానికి స్ఫూర్తిగా నిలిచే జల్, జమీన్, జంగిల్ నినాదమై బతుకుతున్నాడు..

## వీరాంగన లీపా



**జననం: అండమాన్ని కోబార్ | తెగ: గ్రేట్ అండమాని | వీర మరణం: తేదీ తెలియదు**

బ్రిటీషువారికి అండమాన్ సమాజ పూర్తి వ్యూహాల గురించి సమాచారం అందించిన దేశద్రోహి, తన భర్త దుద్నాత్ తివారికి పుట్టబోయే తన సొంత బిడ్డను కూడా త్యాగం చేసిన వీరాంగన లీపాను అండమాన్ పన్నధాయ్ (పన్నాదై)గా పిలువవచ్చు.




## యూ కియాంగ్ నోంగ్బా

**జననం: జోవాయి, మేఘాలయ | తెగ: జయంతియా | వీరమరణం: 30 డిసెంబర్ 1862.**


1835లో 'విభజించు పాలించు' సిద్ధాంతానికి అనుగుణంగా బ్రిటీషువారు మేఘాలయలోని జైంతియా పూరు కొండలు, మైదాన ప్రాంతాలుగా విభజించారు. రాష్ట్ర పాలకుడు బ్రిటీష్వారి భౌగోళిక విభజనను భయంతో అంగీకరించాడు. రాజు నిర్ణయాన్ని ప్రజలు, మంత్రుల మండలి తిరస్కరించింది. యువ యూ కియాంగ్ నొంగ్బా గిరిజన వీరుల సైన్యాన్ని ఏర్పాటు చేయడం ప్రారంభించాడు.

## రాంజీ గోండ్



**జననం: సంభాస్, ఆదిలాబాద్, తెలంగాణ | తెగ: గోండ్ | వీర మరణం: 9 ఏప్రిల్ 1860.**

బ్రిటీషువారికి అనుకూల నియంతగా తెలంగాణను ఎలుతున్న నిజాంలను ఎదిరించిన గిరిజన స్వాతంత్ర్య వీరుడు, 1857 సిపాయిల తిరుగుబాటులో భాగంగా వీరోచితంగా పోరాడిన గోండు తెగకు చెందిన ధీరుడు రాంజీ గోండ్. ఇతను గోండు, మరాఠా, మహర్, రోహిల్లా తెగలకు చెందిన గ్రామస్తులను సంఘటితం చేసి ఒక సైన్యాన్ని నిర్మించాడు. రాంజీ వారి సాయంతో బ్రిటీషువారితో యుద్ధానికి దిగి కొన్ని ప్రాంతాలలో ఓడించాడు. నిర్మల్, నగర పరిసర గ్రామాలన్నింటిని ఆక్రమించి అప్రకటిత రాజయ్యాడు. మూడేళ్ళ పాటు నిజాం ఎంత ప్రయత్నం చేసిన తిరిగి ఆక్రమించుకోలేకపోయాడు. రాంజీ గోండ్ తన అసాధారణ తెలివితేటలతో బ్రిటీషువారిపై తన పోరాటాన్ని అలాగే కొనసాగించాడు. 09 ఏప్రిల్ 1860న కల్నల్ రాబర్ట్ తన సైన్యంతో రాంజీ గోండ్ ఆధీనంలో ఉన్న నిర్మల్ నగరంపై దాడిచేశాడు. కానీ రాంజీ సుమారు వెయ్యిమందితో ఎదురు దాడిచేశాడు.



## తామా డోరా

**జననం: మల్కాన్ గిరి, ఒడిశా | తెగః కోయ | వీర మరణం: 1880.**

1857 తొలి మహాసం గ్రామం సన్నగిల్లిన తర్వాత ఒడిశాలోని అటవీ ప్రాంతాలలో బ్రిటీషు మళ్ళీ గిరిజన బిడ్డలపై దోపిడీ చెయ్యడం మొదలుపెట్టారు. దీనికి వ్యతిరేకంగా పోరాటాన్ని ప్రారంభించిన కోయ వీరుడు తామా డోరా.

## సురేంద్ర సాయ్

**జననం: 23 జనవరి 1809, ఖిండా, సంబల్పూర్, ఒడిశా | తెగ గోండ్ వీర మరణం: 1884.**

1857లో జరిగిన విప్లవంలో ఒడిశాకు ప్రాతినిధ్యం వహించిన గోండు తెగకు చెందిన గొప్ప వీరుడు సురేంద్ర సాయ్.





## గోవింద్ గురు

**జననం: 1858 బన్సియా, దుంగాపూర్, రాజస్థాన్ | వీర మరణం: 30 అక్టోబర్ 1931.**

భారతదేశ చరిత్రలో బ్రిటీషు పాలనకు వ్యతిరేకంగా అత్యంత శక్తివంతమైన ఉద్యమం 19వ శతాబ్దం చివరి దశాబ్దంలో భీల్ సమాజం నుండి ఉద్భవించింది. ఈ ఉద్యమానికి గోవింద్ గురు నాయకత్వం వహించారు.

## నారాయణ సింగ్



**జననం: 1795, సోనాఖాన్, రాయపూర్, ఛత్తీస్ ఘడ్ | తెగ బింజ్వార్ వీర మరణం: 10 డిసెంబర్ 1857.**

మొదటి స్వాతంత్ర్య పోరాటంగా పిలవబడే 1857 తిరుగుబాటు వీరులలో నారాయణసింగ్ పేరు కూడా ఒక ప్రముఖమైనది. అతను ఛత్తీస్ ఘడ్లోని రాయపూర్ జిల్లాలో ఉన్న సోనాఖాన్కు చెందిన భూస్వామి.

## ఉతిరోత్ సింగ్



**జననం: 1802, మైరంగ్, మేఘాలయ | తెగ: ఖాసీ |వీర మరణం 17 జూలై 1835.**

అమర వీరుడు, భారత స్వాతంత్ర్య యోధుడు ఉ తిరోత్ సింగ్ మేఘాలయలోని ఖాసీ కొండల్లో ఉన్న ఖడ్సాఫా సియోమేషిప్కు చెందిన రాజు.

## రన్మత్ సింగ్

**జననం: 1825, మనకారి, సాత్నా, మధ్యప్రదేశ్ | వీర మరణం: 1859.**



1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటు అఖండ భారతావనినంత ఐక్యత వైపు నడిపింది. ఆ పోరాట జ్వాల కొద్ది కాలంలోనే అన్ని ప్రాంతాలకి విస్తరించింది. అందులో భాగంగా మధ్యప్రదేశ్లోని సాత్నాలో పోరాటానికి సమర శంఖం పూరించిన వీరుడు ఠాకూర్ రన్మత్సింగ్.

## ఖాజ్యా నాయక్



**జననం: సేన్వా, బర్వాని, మధ్యప్రదేశ్| తెగ: భీల్ | వీర మరణం: 3 అక్టోబర్ 1860.**

భీల్ తెగలో జాతీయ వీరుడైన పూన్జాభీల్ పరంపరలోనే నిలవగలిగిన మరో గొప్పవీరుడు ఖాజ్యా నాయక్, ఖాజ్యానాయక్ తండ్రి బ్రిటీషు ప్రభుత్వంలో ఉద్యోగిగా పనిచేసేవారు. తండ్రి నుంచి వారసత్వంగా ఆ ఉద్యోగం ఖాజ్యానాయక్కు వచ్చింది.

## సంత్రం నేగి

**జననం: 1725, జాన్సార్, డెహ్రాదూన్, ఉత్తరాఖండ్ | తెగ: జౌన్సారి | వీరమరణం: 14 ఫిబ్రవరి 1746.**



డెహ్రాదూన్కు పశ్చిమంగా చాలా దూరంలో ఉన్న జాన్సార్ ప్రాంతానికి చెందిన గిరిజన వీరుడు సంత్రం నేగి, మొఘల్ రాజైన గులాం ఖాది ర్యాన్ డెహ్రాదూన్పై దాడి చేసి ఆక్రమించాడు.

## బాబూరావు షడ్మా



**జననం: మార్చి 12 1833, ఘోట్గావ్, చంద్రపూర్, మహారాష్ట్ర | తెగః గోండ్ | వీరమరణం: 21 అక్టోబర్ 1858,**

భారత స్వాతంత్ర్య పోరాటంలో బాబూరావు త్యాగం సువర్ణాక్షరాలతో లిఖించదగ్గది. బాబురావు మహారాష్ట్రలోని చంద్రపూర్ గ్రామంలో జన్మించాడు. గిరిజన బిడ్డ కావడంతో అడవి అన్ని 'వేటలు' నేర్పింది. అప్పుడు తనకు తెలీదు భవిష్యత్తులో అది బ్రిటీషువారికి వ్యతిరేకంగా పోరాడడానికి ఉపయోగపడుతుందని, బ్రిటీషువారు గిరిజనులకు వ్యతిరేకంగా తీసుకొస్తున్న పన్ను విధానాన్ని, దాని మునుగులో మొదలైన దోపిడీలు ఇవన్నీ చూసిన బాబూరావు వారికి వ్యతిరేకంగా యుద్ధభేరి మ్రోగించాడు.


## రాణా పూంజా భీల్



**జననం: మేర్పూర్, రాజస్థాన్ | తెగ: భీల్ | వీరమరణం: తేదీ అందుబాటులో లేదు.**

దేశంలో వీరులకు, శూరులకు జన్మస్థానమనదగినది రాజస్థాన్లోని మేవార్, ఆ ప్రాంతానికే గర్వకారణంగా నిలిచినవాడు రాణా పూంజా భీల్. రాణా పూంజా భీల్ 16వ శతాబ్దంలో రాజస్థాన్లోని మేర్పూర్లో జన్మించాడు. తండ్రి దూదా హొలంకి. తల్లి కెహ్రీబాయి. చిన్నతనం నుండే పూంజా భీల్ ధైర్యవంతుడు, శక్తివంతుడిగా పేరు తెచ్చుకొన్నారు.

## బఖ్తర్ సాయి & ముండల్ సింగ్



**జననం: బఖ్తర్ సాయి-నవాగర్, రైది, గుమ్లా, జార్ఖండ్, ముండల్ సింగ్పహార్ పనారి, గుమ్లా, జార్ఖండ్ | తెగః రౌతీయ ఖంగర్ | వీరమరణం: 4 నవంబర్ 1812.**

దేశ స్వాతంత్ర్యంకోసం మరణించి నేటి చరిత్రకి అందకుండా మర్చిపోయిన యోధులు బఖ్తర్ సే ముండల్ సింగ్.


## రాఘోజీ భాంగ్రే



**|తెగ:కోలి|వీరమరణం: 2 మే 1848. జననం:8 నవంబర్ 1805, దేవగావ్, మహారాష్ట్ర**

క్రాంతివీర్ రాఘోజీరావు 1805లో బ్రిటీష్ ఇండియా మహారాష్ట్ర పశ్చిమ ఘాట్ అకోలేలోని దేవగావ్లో రామ్ రావ్ భాంగ్రీకు జన్మించాడు. వీరి కుటుంబ సభ్యులందరూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు.

## రండో మాంఝి



**జననం: ఉర్లదాని, కలహండి, ఒడిశా | తెగః కంధ | వీరమరణం: లభించలేదు.**

గిరిజనులు ఎప్పుడూ వారి సహజ సిద్ధమైన స్వీయపాలనను ఇష్టపడతారు. దాన్ని అన్ని కాలాల భారతీయ చక్రవర్తులు గౌరవించారు. కానీ ఆ ఆచారాన్ని మొదటగా అపేక్ష చేసింది విదేశీ పాలకులు. ముఖ్యంగా బ్రిటీష్వారు. పన్నుల పేరుతో గిరిజనులపై ఆధిపత్యం చలాయిస్తూ పరిపాలనను అడ్డుపెట్టుకొని దోచుకోవటం మొదలుపెట్టారు. కంద తెగ ప్రజల నైతిక స్థైర్యాన్ని విచ్ఛిన్నం చేయడానికి రండో మాంఝిని బందీగా గ్రామ గ్రామానికి తిప్పి ఉరితీసారు. అయినా కంద ప్రజలు మరింత రెట్టింపు తెగువతో దేశ స్వాతంత్ర్య సాధనలో తమవంతు రుధిరాన్ని ధారపోశారు.

## భీమా నాయక్



**జననం: పంచ మొహలి, బర్వాని, మధ్యప్రదేశ్ | తెగ: భీల్ | వీరమరణం: డిసెంబర్ 29- 1876.**

చారిత్రాత్మకమైన 1857 విప్లవంలో నూనుగు మీసాల్యవయసులోనే ప్రాణాలు అర్పించిన గిరిజన వీరుడు భీమా నాయక్. బాల్యం నుంచే అపూర్వ పోరాట పటిమ కలిగినవాడు భీమానాయక్.

## పా తోగెన్ సంగ్మా



**జననం: తూర్పు గారో హిల్స్, మేఘాలయ | తెగః గారో | వీరమరణం: 12 డిసెంబర్ 1872**

భారతదేశం కన్న గొప్ప విప్లవకారుల్లో తోగెన్ సంగ్మా ఒకరు. మేఘాలయలోని గారో కొండలను బ్రిటీష్వారు. 1872లో ఆక్రమించి అడవిపై ఆంక్షలు విధించడం మొదలుపెట్టారు. అడవిపై ఆధారపడ్డ గిరిజనుల జీవితాలకి ఇది గొడ్డలిపెట్టుగా మారింది. క్రమంలో ఈ గిరిజనులను ఏకం చేసి సాయుధ సైన్యంగా మలిచి తిరుగుబాటు బావుటా ఎగరేశారు తోగెన్ సంగ్మా.

## నీలంబర్ - పీతంబర్



**జననం: చమోశానియ, ఘుర్వా, జార్ఖండ్ | తెగః ఖార్వార్ |వీరమరణం: 28 మార్చ్ 1858.**

1857లో భారతదేశంలో జరిగిన మహా తిరుగుబాటులో జార్ఖండ్కు చెందిన నీలంబర్– పీతంబర్లు కీలక భూమిక పోషించారు. వారికంటూ చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం ఉంది. జార్ఖండ్లోని ఖర్వార్ తెగకు చెందిన ఈ వీరులు లాతెహార్ జిల్లాలోని కెమో–సేన్యా గ్రామంలో జన్మించారు.

## రాజా శంకర్ షా & రఘునాథ్ షా



**జననం: జబల్పూర్, మధ్యప్రదేశ్ | తెగః గోండ్ | వీర మరణం: 18 సెప్టెంబర్ 1857.**

1857 తిరుగుబాటులో తమ ప్రాణాలను అర్పించిన రాజా శంకర్ షా & రఘునాధ్ షాలు మధ్యప్రదేశ్లోని గోండ్వానా ప్రాంతంలో గోండ్ రాజవంశానికి చెందిన సుప్రసిద్ధ రాజులు.

## భాగోజీ నాయక్



**జననం: నందూర్ శిన్గోటే, నాసిక్, మహారాష్ట్ర | తెగ: భీల్ | వీర మరణం: 1859.**

ఆయన పేరు వింటేనే బ్రిటీషువారు వణికిపోయేవారు. నాసిక్ ప్రాంతంలో జరిగిన పోరాట చరిత్రలో భీల్ తెగకు చెందిన వీరుడు, విప్లవకారుడు భాగోజీ నాయక్కు ఒక ప్రత్యేక స్థానం ఉంది. 1855లో జరిగిన కోలీ తిరుగుబాటులో కీలక భూమిక పోషించాడు.